ఆదివారం

ప్రజాశక్తి

జనవరి 19, 2003

వచ్చేస్తున్నాయ్ సూపర్‌ఫాస్ట్ రైళ్ళు!!

హ్యాపీ బర్త్‌డే

(19-1-2003నుండి
25-1-2003వరకు)

మౌళిక
జనవరి-19
వెంకటలక్ష్మి-బుజ్జిరెడ్డి
నెరవాడ- కర్నూలు

రచ్చా జ్ఞానేష్ కుమార్
జనవరి-19
దుర్గాభవాని- ఏసుబాబు
పెనమలూరు-కృష్ణ

పుప్పాలగూడెం వంశి
4సం॥, 20.1.1999
నిర్మల - యాదగిరి
కొండాకల్‌శేరిగూడెం-శంకర్‌పల్లి



టి.సాయికిరణ్
1సం॥ జనవరి
భాగ్యలక్ష్మి- సురేష్
మేడ్చెల్- రంగారెడ్డి

యం.శృతిక
5సం॥, జనవరి
సుధ- రాజు
నారాయణఖేడ్- మెదక్

సాయిమనోజ్‌రెడ్డి
1సం॥,20.1.2002
శిరీష - సుబ్బరాంరెడ్డి
మర్రిగూడ - నల్లగొండ



బి.రేష్మాతనూజ
5సం॥, 21.1.1998
అరుణజ్యోతి- కృష్ణారావు
విజయనగరం

బుగ్వేద్
జనవరి- 21
ఈశ్వరి- చంటి
కామయ్య తోపు సెంటర్

పి. ప్రత్యూష్
1సం॥, 21.1. 2002
సరస్వతి- జమలయ్య
ముషీరాబాద్, హైదరాబాద్

ఎమ్. కృష్ణ చైతన్య(చైతు)
3సం॥ 22.1. 2000
మాలతి- రాఘవులు(రఘు)
కృష్ణలంక- విజయవాడ

ఎర్రమౌనిక
2సం॥, 22.1.2001
రమణ- కృష్ణాగౌడ్
దేవరకొండ- నల్లగొండ

డి. సునీత
7సం॥22.1.1996
లక్ష్మి- రాధాకృష్ణ
కొవ్వూరు- ప॥గో॥

సాయిగణేశ్ రాజు, ప్రవల్లిక
6సం॥,23.1.1997- 8సం॥, 23. 1. 1995
మంజుల- మురళి
ఆమదాల వలస-శ్రీకాకుళం

రామాయణపు రమ్య
4సం॥ 24. 1. 1999
లక్ష్మీ నరసమ్మ- రమణయ్య
గిరినగర్

బానోతు నిఖిత
2సం॥, 25.1.2001
భారతి- రాందాస్
బయ్యారం- ఖమ్మం

సన్నీ
2సం॥, 25.1.200
సుజన- శంకర్ ప్ర

డా॥ దక్షిణామూర్తి ఎం.డి.

విలువైన వ్యాయామం 'నడక'

సమతుల్యమైన ఆహారంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తుంటే దీర్ఘకాలం ఆరోగ్యవంతమైన జీవితానికి దోహదపడుతుంది. సోమరి తనంగా ఉండేవారికంటే, భౌతికంగా చురుకుగా ఉండేవారు ఎక్కువకాలం జీవిస్తారనేది అందరికీ తెలిసిన విషయమే. రోజువారీ వ్యాయామంవల్ల రక్తంలోని కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు వంటి క్రొవ్వు పదార్థాలు, రక్తంలోని షుగర్ తగ్గుముఖం పడతాయి. గుండెకు మేలు కలిగించే మంచి కొలెస్ట్రాల్ 'హెచ్.డి. ఎల్.' పెరుగుతుంది. వ్యాయామం వల్ల బి.పి. కొద్దిగా ఎక్కువ ఉన్నవారిలో బి.పి. మామూలు స్థాయికి వస్తుంది. స్థూలకాయం తగ్గడానికి మితాహారంతో పాటు వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. వ్యాయామంవల్ల శరీరంలో ఎక్కువగా పేరుకుపోయిన క్రొవ్వు తగ్గి, మధ్యవయస్సులో వచ్చే పొట్ట, వంగి నడవటం తగ్గి, కండరాలు దృఢంగా ఉండటంవల్ల శరీరాకృతి మెరుగవు తుంది. వ్యాయామం చెయ్యటంవల్ల కండరాల్లో రక్తప్రసారం పెరిగి, వాటికి మరింత ప్రాణవాయువు అందటం మూలంగా కండరాలశక్తి మెరుగై, తద్వారా శరీర దారుఢ్యం మరింత పెరుగుతుంది. వ్యాయామంవల్ల జీర్ణకో శానికి, ప్రేగులకు రక్తప్రసారం పెరిగి జీర్ణశక్తి మెరుగవుతుంది. వ్యాయామం మనజీవితకాలాన్ని పొడిగించటమేకాక, మన జీవితంలో జీవాన్ని నింపుతుంది. వ్యాయామం చేయని వ్యక్తి జీవితం నిస్సారంగా, నిస్తేజంగా, నిర్లిప్తంగా, నిరాసక్తంగా, నిష్ప్ర యోజన మవుతుంది. విశ్రాంతిని కలిగించే 'ట్రాన్క్విలైజర్ మాత్రలవల్ల, నిద్ర బిళ్ళల వల్ల, మద్య పానీయాలవల్ల చేకూరేది సరైన ప్రశాంతత కాదు. భౌతికంగా, మానసికంగా చక్కని ప్రశాంతత పొంద డానికి వ్యాయామం తప్ప మరో గత్యం తరం లేదు. పోటీ మన స్తత్వాన్ని పెంచే క్రీడలు యువతరానికి మంచివే. ఒంటరి గానో, ఒకరిద్దరు సహచరులు పాల్గొనే క్రీడలు బాల్యం నుంచి, పెద్ద వయసు వచ్చే వరకూ కొనసాగించవచ్చు. వృద్ధు లకు, అనారోగ్యం ఉన్నవారికి, శ్రమతో కూడిన కఠినమైన వ్యాయామం పనికి రాదు. 30 సంవత్స రాలు దాటిన వారు వ్యాయామం మొదలు పెట్టే ముందు, కుటుంబ వైద్యునితో చెకప్ చేయించుకో వాలి. ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి, ఆ కుటుంబంలోని వంశపారంపర్య వ్యాధులనుబట్టి ఎటువంటి వ్యాయామం వీలవుతుందో డాక్టర్ సలహాఇస్తారు.

ఈదటం, సైకిల్ త్రొక్కటం, నాట్యం, వేగంగా నడవటం మొదలైనవి. టెన్నిస్, బాడ్మింటన్, గోల్ఫ్ మొదలైన ఆటలు (డైనమిక్ వ్యాయామాలు) పరిమితికి లోబడిచేస్తే అన్ని వయస్సుల వారికీ ఉపయోగం. ఆరోగ్యం సరిగా లేనివారు, బి.పి., మధుమేహం, గుండె జబ్బులు మొదలైన వ్యాధులు ఉన్నవారు 'స్టేటిక్' వ్యాయామాలు ఉదా:- బరువు

ఎత్తటం, బస్కీలు, మొదలైనవి చేయకూడదు.

మనం ఎంతకాలం జీవించేది కొంతవరకు వంశపారంపర్యంగా మనకు సంక్రమించే 'జీన్'ల మీద ఆధారపడి ఉంటుంది. కాని మన మధ్యవయస్సులో, వృద్ధాప్యంలో మన ఆరోగ్యం, మనం పాటించే జీవన విధానాల మీద ఆధారపడి ఉంటుంది. మనం భౌతికంగా చురుకుగా లేకపోతే, వృద్ధాప్యం - దాని పరిణామాలు మరింత త్వరగా బయటపడతాయి. రిటైరైన తరువాత శరీర దారుఢ్యం కొనసాగాలంటే వ్యాయామం తప్పక చేయాలి. డా॥ పాల్‌డ్లీ వైట్ అనే ప్రముఖ హృద్రోగ నిపుణుడు క్రమం తప్పకుండా వ్యాయామం చెయ్యటంవల్ల గుండెపోటును నివారించవచ్చని ప్రచారం చేసిన అగ్రగణ్యుల్లో ప్రథ ములు. మనుషులకంటే కార్లు ఎక్కువ సంఖ్యలో ఉండే "మస్సాచు సెట్స్" నగరంలో ఆయన ప్రతిరోజూ కొంత సేపు సైకిల్ త్రొక్కుతుండేవాడు. అన్ని వ్యాయామాలలోకి చాలా విలువైనది, సులువైనది, సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉండేదిగా 'నడక' ప్రజాదరణ పొందు తున్నది. వృత్తిరీత్యా కలిగే అలసట, ఆదుర్దా 'నడకవల్ల తగ్గుతాయని డా॥ ఫ్రెడ్‌స్టేట్‌మన్ అనే వైద్యశాస్త్రజ్ఞుడు ప్రథమంగా ప్రచారం చేశాడు.

అన్ని వయస్సులవారు, మధుమేహం, బి.పి., గుండెజబ్బులు ఉన్నవారు ఆ వ్యాధులు నివారించుకోదలచినవారు నడవవచ్చు. ◆

☞ బరువు తగ్గడానికి నడక దోహదం చేస్తుంది. 1 పౌను బరువు తగ్గాలంటే 3,500 కేలరీలు ఖర్చుచేయాలి. ఒక మాదిరివేగంతో (ఉదా: గంటకు మూడు మైళ్ళ వేగంతో) రోజు విడిచి రోజు 1గంట నడిస్తే, నెలకు 1 1/2 పౌనుల బరువు, సంవత్సరానికి 18 పౌనుల బరువు తగ్గవచ్చు. (ఆహారాన్ని మితంగానే తీసుకొంటూ ఉండాలి!) బరువు వేగంగా తగ్గాలంటే ప్రతిరోజూ 1 గంట నడిచి నెలకు 3 పౌన్లు తగ్గవచ్చు.

☞ నడక కార్యక్రమాన్ని ప్రారంభించే వృద్ధులు, అలవాటులేనివారు, నడిచే వేగాన్ని క్రమేణా పెంచాలి. మొదటి రెండు వారాలు రోజుకు 15 నిమిషాలు, తరువాత రెండు వారాలు రోజుకు 30 నిమిషాలు, తరువాత రోజుకు 45 నుండి 60 నిముషాలకు పెంచాలి.

☞ గంటకు రెండు మైళ్ళ వేగంతో అంటే నిముషానికి షుమారు 80 అంగలు లేదా గంటకు మూడు మైళ్ళు అంటే నిముషానికి 120 అంగలు (ఒక మాదిరి వేగం) నడిస్తే చాలు.

ధరలు... ధరలు...

అంపశయ్య నవీన్

"బియ్యం ధర మండిపోతున్నది చూశారా?" అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు.

"అవును... ఒక్క బియ్యం ధరేమిటి? మనిషి ఆకలిని తీర్చడానికి సంబంధించిన అన్ని వస్తువుల ధరలూ పెరిగిపోతున్నాయి... వంట చేసుకోవడానికవసరమయ్యే వంటగ్యాస్‌ధర, కిరోసిన్ ధర పెరిగిపోతున్నాయి. అదే సెల్‌ఫోన్స్ రేట్స్ తగ్గిస్తున్నామని ప్రభుత్వ అధీనంలో వున్న 'బి.ఎస్.ఎన్.ఎల్.', అటు ప్రైవేటు రంగంలో ఉన్న 'టాటా, ఎయిర్‌టెల్' ఒకర్ని మించి ఒకరు ప్రకటిస్తున్నారు.. చాలా విచిత్రమైన పరిస్థితేమిటంటే అత్యవసర వస్తువుల ధరలేమో విపరీతంగా పెరుగుతున్నాయి. విలాస వస్తువుల ధరలేమో తగ్గిపోతున్నాయి" అన్నాను.

"నిజమే... కలర్ టీవీల ధరలు, కార్ల ధరలు, ఫ్రిజ్‌ల ధరలు, వాషింగ్ మెషీన్‌ల ధరలు తగ్గిస్తున్నామని, వాటిని కొంటే వాటితో పాటు కొన్ని వేరే వస్తువుల్ని ఉచితంగా ఇస్తామని కూడా ప్రైవేట్ కంపెనీల వాళ్ళు చెవులు హోరెత్తించేలా టీవీల్లోనూ, రేడియోల్లోనూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఇవ్వాళ్ళ ఎంత చిన్న వస్తువులు కొన్నా.. సోప్స్ లాంటివో, ఫేస్ పౌడర్లలాంటివో,. బ్లేడ్స్‌లాంటివో, ఆఫ్టర్‌షేవ్‌లోషన్ల లాంటివో కొంటే వాటితో బాటు వేరే ఏదో ఒక వస్తువును ఫ్రీగా ఇస్తున్నారు. ఎప్పుడైనా మార్కెట్‌కు వెళ్ళి నేనేవైనా వస్తువులు కొనుక్కొస్తే చాలా మా ఆవిడ వెంటనే ఫ్రీగా ఏమిచ్చారు అని అడుగుతుంది. అసలు వస్తువుకంటే ఫ్రీ గా ఇచ్చిన వస్తువును అపురూపంగా చూసుకుంటుంది. ఫ్రీగా ఏమీ ఇవ్వలేదని చెప్పాననుకోండి. నన్నో తెలివి తక్కువ వాడికింద జమ కట్టేస్తుంది. ఆషాపు వాడెవడో మిమ్మల్ని మోసగించాడంటుంది" అన్నాడు పుల్లారావు.

"మరో విషయం కూడా మీరు గమనించే ఉంటారు. కొన్ని వస్తువులుకొంటే ఏదో ఒక లక్కీ కూపన్ ఇస్తామంటారు. ఆ లక్కీ కూపన్ వల్ల మీరు తెల్లారేసరికల్లా లక్షాధికారులై పోవచ్చునంటారు. ఇవన్నీ వస్తువుల్ని అమ్ముకోవడానికి, మనలాంటి కన్స్యూమర్స్‌ని ప్రలోభపెట్టడానికి పెట్టుబడిదారులు ఉపయోగించే ట్రిక్స్. మనకేమో ఒకటికొంటే ఒకటి ఫ్రీగా వస్తున్నది కదా.. కొందాం అనిపిస్తుంది" అన్నాను.

"మన బట్టల షాపుల వాళ్ళు చూశారా? దసరా, దీపావళి, సంక్రాంతిలాంటి పండుగల సీజన్ వచ్చిందంటే వాళ్ళ షాపుల ముందు ఓ అందమైన మారుతీకారో, సాంట్రోకారో, మరోకారో కనిపిస్తుంది. రెండు వందల విలువగలవో, మూడు వందల విలువగలవో బట్టలు కొన్నారంటే మీకో లక్కీ కూపన్ వస్తుందని, దాంతో ఈ నిగనిగలాడ్తున్న ఐదు లక్షల కారు మీ స్వంతమవుతుందని షాపు ముందో పెద్దబోర్డు పెడ్తారు. దాంతో అందరూ అవసరం లేకపోయినా ఆకారు మన స్వంతం కాకపోతుందా అన్న ఆశతో మూడువందల రూపాయల బిల్ చేసి ఓ లక్కీ కూపన్ తీసుకుంటారు..." అన్నాడు పుల్లారావు.

"అవును.. మధ్యతరగతి వాళ్ళు ఇలాంటి ప్రలోభాలకు చాలా సులభంగా లోనవుతుంటారు. ఈ మధ్య నేను మరో విషయం కూడా గమనించాను. చాలా మంది స్త్రీలు తమ ఇళ్ళల్లోనే చీరెల వ్యాపారాలు మొదలెట్టారు. వాళ్ళ ఇళ్ళ ముందు ఇదో చీరెల షాపు అని బోర్డు ఉండదు. షాపు పెట్టుకోవడానికి వాళ్ళకెలాంటి లైసెన్స్‌గానీ, పర్మిట్‌గానీ ఉండవు. వాళ్ళకు ఏ పన్నూ కట్టే అవసరముండదు. ఎక్కడెక్కడికో వెళ్ళి రకరకాల చీరెలు తెస్తారు. వాళ్ళ ఇంటి పక్కనుండే ఆడవాళ్ళకు తాము చీరెలమ్ముతున్నామన్న విషయం తెలిసేట్టు చేస్తారు. ఒకరి నుండి మరొకరికి ఈవార్త తెలిసిపోతుంది. చీరెలనగానే స్త్రీలకు చాలా సహజంగా చూసొద్దామనే కోరిక కలుగుతుంది. దాంతో అనేకమంది స్త్రీలు ఈ చీరెలమ్మే వాళ్ళ ఇళ్ళకొస్తారు. ఇక్కడమ్మబడే చీరెలకు ఒక ఫిక్స్‌డ్ రేటంటూ ఉండదు. మొదలే ఎక్కువ చెప్పి తర్వాత బేరమాడుతున్న కొద్దీ తగ్గిస్తుంటారు. మొదలు చెప్పిందానికంటే చాలా తగ్గించి ఇస్తున్నారు కదా... తీసుకుందాం అనిపిస్తుంది. కొందామన్న నిర్ణయాన్ని బలోపేతం చేసే మరో విషయమేమిటంటే డబ్బు మొత్తం ఒకేసారి ఇవ్వాల్సిన పని లేదు. మొదలు కొంచెం ఇచ్చి మిగతాది వాయిదాల పద్ధతి మీదివ్వొచ్చు. ఇలా కొందరు స్త్రీలు చాలా కాలనీల్లో చీరెల వ్యాపారం చేస్తూ లక్షలకు లక్షలు సంపాదిస్తున్నారు-వీళ్ళు ఏ రసీదులు ఇవ్వరు - ఏ సేల్స్‌టాక్స్‌గానీ, ఇన్‌కమ్‌టాక్స్ గానీ పే చెయ్యరు...."

"నిజమేనండోయ్.. ఈ మధ్యనే మా ఆవిడ కూడా ఇక్కడ మన కాలనీలోనే ఓ ఆవిడ చీరెల వ్యాపారం చేస్తోందనీ, ఆమె కలకత్తాకో, కంచికో వెళ్ళి కొత్త కొత్త చీరలు తెచ్చిందనీ ఎవరో చెబితే వెళ్ళి ఓ పదివేల చీరలు కొని ఎవరో వెళ్తోంటే అమెరికాలో ఉంటున్న మా అమ్మాయికి పంపించింది"

"కాపిటలిస్ట్ సిస్టమ్‌లో కన్స్యూమర్‌ని ప్రలోభ పెట్టి తమ వస్తువుల్ని అమ్ముకొని, లాభపడటానికి ఇలాంటి ఎన్ని ట్రిక్స్‌ని ప్రయోగిస్తారో లెక్కలేదు.... ఇప్పుడు ప్రపంచ మార్కెట్లలో స్లంప్ ఏర్పడిందంటున్నారు... స్లంప్ అంటే వ్యాపారం డిమాండ్ బాగా ఉంటుందని ఆశించి ఉత్పత్తిదారులు వస్తువుల్ని పెద్దమొత్తంలో ఉత్పత్తి చేస్తారు. కానీ మార్కెట్లో వస్తువుల ఉత్పత్తి ఏ రేటులో అయితే పెరుగుతుందో డిమాండ్ ఆ రేటులో పెరగదు. దాంతో వ్యాపారం మందగిస్తుంది. వినియోగదారుల్ని ఎలాగైనా మార్కెట్‌కు రప్పించి వాళ్ళచేత వస్తువుల్ని కొనిపించడానికి రకరకాల ట్రిక్స్‌ని ప్రయోగిస్తారు. అదే నిత్యావసర వస్తువులైతే వినియోగదారులు తప్పకుండా కొనుక్కోవల్సిందే. వాటికి డిమాండ్ ఎప్పుడూ పెరుగుతుందనే గాని తగ్గదు. అందుకే వాటి ధరల్ని పెంచేస్తున్నారు" అన్నాన్నేను. ◆

...చుక్కలు కలపండి



గాడిదల అధిపతి

ఓసారి పాదుషాకి ఓ చిలిపి ఆలోచన వచ్చింది. నసీరుద్దీన్‌ని ఎలాగైనా ఏడిపించాలనుకున్నాడు. అందుకని ఓ రోజు ఆయన్ని పిలిపించాడు. ఆరోజు సభకు మంత్రులందరూ హాజరయ్యారు. అప్పుడు పాదుషా ఓ ముఖ్యమైన ప్రకటన చేశారు. అదేంటంటే 'నేను ఇప్పుడు ఓ గొప్ప నిర్ణయం తీసుకున్నాను. దాన్ని ప్రకటిస్తాను. అదేంటంటే మన వూళ్లో వున్న గాడిదలన్నిటికీ నసీరుద్దీన్‌ని అధిపతిగా నియమిస్తున్నాను' అన్నాడు. ఆ మాటకి మంత్రులు, అధికారులు, సభలో వున్న సామాన్య ప్రజలు ...అందరూ ఫక్కున నవ్వారు. నసీరుద్దీన్ మాత్రం తాపీగా లేచి ముందుగా పాదుషాకి, తర్వాత ప్రజలకు వినయంగా సలామ్ చేశాడు. తర్వాత పాదుషా సింహాసనంపైన వుండే చాందినీపైకి ఎక్కాడు. దాంతో ప్రజలంతా విస్తుపోయారు. 'ఏంటి నసీరుద్దీన్‌కి ఇవాళ ఏమైంది? రాజుగారి సింహాసనంకంటే ఎత్తులో కూర్చుంటాడా?' అనుకున్నారు మనసులో. ఇక పాదుషాగారికైతే ఒళ్లు మండిపోతోంది. 'నసీరుద్దీన్! నీకు ఎంత పొగరు? నాకంటే ఎత్తులో కూర్చుంటావా? కిందికి దిగు. వెంటనే' అని గుడ్లు ఉరుముతూ అరిచాడు.

నసీరుద్దీన్ మాత్రం రాజసం ఉట్టిపడేట్టు చెయ్యి పైకెత్తి 'మాట్లాడొద్దు' అన్నట్టు సైగ చేశాడు. పాదుషాకేసి, మంత్రుల వైపు తిరిగి 'హుష్... వద్దు! మన్నన, మర్యాద వుండాలి. నేను మీ అందరికి అధిపతిని, అవునా అన్నాడు?'. దీంతో ప్రజలకి ఓ పెద్ద అనుమానం వచ్చింది. 'అంటే పాదుషాగారితో సహా అందరం గాడిదలమేనా!' అని.

కలం స్నేహం

...ండుగాల రాము,
...: 13 సం॥
...8 వ తరగతి
...టీవీ చూడడం, క్రికెట్ ఆడడం.
...రునామా :
..., సన్నాఫ్ యాదయ్య, నోముల, నల్లగొండ.



పేరు: కింతలి రమ్య,
వయసు :8 సం॥
చదువు : 3వ తరగతి,
హాబీలు: క్యారమ్స్ ఆడడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా :
కింతలి రమ్య, డాటరాఫ్ కె. సత్యారావు(టీచర్), నరసన్నపేట, శ్రీకాకుళం.

పదాల పదనిసలు

గో	?
రే	
చా	
పా	
రా	

పక్కన ఒక్క అక్షరం పెద్దగా రాస్తే చాలు, అన్నిటికీ సరిపోతుంది. మీరు రాసిన ఆ ఒక్క అక్షరంతో ఐదు పదాలు తయారవుతాయన్నమాట. మరి రాస్తారా. తెలియకపోతే వచ్చే వారం ఇదే శీర్షికలో చూడండి.

గతవారం జవాబులు

నే	ల
	ను
	స్తం
	రం
	త

వేళ్లతో బాతు

నేస్తాలూ!

గతవారం చేతి వేళ్లతో బొమ్మలు చేయడం గురించి చెప్పుకున్నాంకదా. మరి చేయడం వచ్చిందా? మీ ఇంట్లో పెద్దవాళ్లకి, మీ స్నేహితులకి చూపించారా? వేళ్లతో బాతుకూడా చేయవచ్చు. అదెలాగంటే... రాత్రిపూట గోడ దగ్గర నిలబడి బొమ్మలో చూపించినట్టుగా చేతి వేళ్లుపెడితే సరి. బాతు బొమ్మ కనిపిస్తుంది. వచ్చే వారం మరో మేజిక్ చెప్తాగా. అప్పటి వరకు సెలవ్.



మేజిక్! మేజిక్!!

రుక్మిణి

గెలుపు కి(అ)టుకులు

"అబ్బో.... అబ్బో... మా బాబుగారికి తెలిసినన్ని 'కిటుకులు' ఈ హోల్ మొత్తం ప్రపంచంలో మరెవడికీ తెలవ్వు! తెలుసుకోలేరు"! పచ్చబాబు చిటికెలు వేశాడు. యాద్గిరి ఏ మాత్రం తొణకలేదు. జక్కులోడు అసలే బెణక్క పోవడంతో బాబు విద్దూరంగా చూసి కళ్ళు మిటకరించాడు!

"వారు కిటుకు చేయడం మీరు చిటికెలేయడం చూసీ... చూసీ అలవాటు పడిపోయినం! అందుకే నోర్లు బార్లా తెరవలేదు - ఏమనుకోమాకండి!" యాద్గిరి సర్దిచెప్పాడు.

"సంగతేమిటంటే - అసలు ఎన్నికలింకా రెండేండ్లుండగానే - దాన్ని గురించి ఎవడూ సరిగా ఆలోచించకముందే మా బాబుగారు 'విజయంమాదే' అని ఢంకా బజాయించేశాడు"

"ఓహో!" యాద్గిరి యథాలాపంగా అన్నాడు.

"అట్లా ఇట్లా లేదు.. ఏకంగా ప్రతిపక్షమే లేకుండా... పక్కా ప్లాను.. దాన్దెబ్బకు మరో పాతికేండ్ల దాకా తిరుగులేదు -అసలు అసెంబ్లీ మొత్తం ఒకే పార్టీ యమ్మెల్లేలు కాకుండిపోతే 'రంజు'గా వుంటుందా? వుండదు గదా!" బాబుగారే ప్రశ్నలేసుకుని తానే జవాబు చెప్పుకున్నా - జక్కులోడు గొర్రెలా తలాడించి సమ్మతిని ప్రకటించాడు-

' ' ఓ రెండొందల యాభై సీట్ల వరకూ గ్యారంటీ... మిగిల్న వాటిని ప్రతిపక్షాల వాళ్ళకిస్తేగానీ 'రంజు'గా వుండదని ఆలోచన.

''ఆహా!'' జక్కులోడు నిజంగా ఆశ్చర్యంగానే అన్నాడు.

''అదీ... గెలుపు కిటుకులు.... గెలుపు కిటుకులు... బాబుగారి సొంతం... ఎట్లాగంటే ఇపుడు మా వాళ్ళలో ఎన్నికలు పెడితే కచ్చితంగా ఓ యాభైమందికన్నా ఎక్కువ మంది గెలవలేరని బాబుగారి కచ్చితమైన కంప్యూటరు అంచనా!"

ఈసారి తప్పనిసరిగా తప్పదు కాబట్టి యథావిధిగా యాద్గిరీ - జక్కులోడు నోళ్ళు కాస్తా వెళ్ళబెట్టడంతో బాబుగారు రెచ్చిపోయి పంచె సర్దుకుని ధమాయించి కూర్చుండి తగులుకున్నాడు -"రంజు అన్నానంటే అర్థం... ఏదో సభజరగాలి గదా... ఎవరో...ఏదో ప్రశ్నలడగాలిగదా... అహ... వాటిని అస్సలు మేం పట్టించుకోం. ఎందుకంటే మొత్తానికి మొత్తం అంతా మా మెంబర్లేనాయె! అప్పోజిషన్ అట్లా నామమాత్రంగా వుండకపోతే అది అసెంబ్లీ అనిపించుకోదు - ఏదో అట్లా అటూ ఇటూ కాని 'అటుకుల్లా' అన్నమాట!" బాబు విచిత్రంగా కులికి నవ్వడంతో యాద్గిరికి వళ్ళు మండిపోయింది!

"మీ అటుకుల సంగతి అలా పెట్టండి! అసలు అట్లా కచ్చితంగా మీరు గెలిచి తీరడానికి - మీ బాబుగారి కిటుకేందో చెప్పవేం!"

"అదే... అదే... క్రీడ... జాతీయ క్రీడాస్ఫూర్తి.. మొన్నటి జాతీయ క్రీడల్లో మొత్తానికి మొత్తం హోల్ పతకాలన్నిట్నీ ఫెటాల్మని గెలుచుకోలేదా... అట్లా!"

"అదెట్లా.. అందులో సగం మంది పొరుగు రాష్ట్రాల ఆటగాళ్ళేనాయె ఆడి గెలిచింది -!" జక్కులోడు విభ్రాంతి పడుతూ అన్నాడు.

"అటుకులు... కుచేలుడు.... శ్రీకృష్ణుడు...!" బాబు మళ్ళా చిటికెలు మోగించాడు. జక్కులోడికేం అర్థంగాక మిర్రిమిర్రి చూశాడు.

"ఆఫ్టరాల్ అటుకుల మంత్రం ప్రయోగించి కుచేలుడు కృష్ణుడ్ని వశపరుచుకున్నాడు - వెరీ సింపుల్! మందగ్గిర వండుకోడానికీ - తిండానికీ బియ్యం లేవు - లేవే అనుకుందాం! ఈ పంజాబీ బియ్యం... పనికి ఆహార పథకం.. అక్రమాల గురించి కాదు.. నేను మాట్లాడేది... అపుడేం చేస్తాం!! ఆకలికి ఆబగా అటుకులందుకుని బొక్కేస్తాం గదా! ఈ ఆటల సంగతీ అంతే!"

"సర్సరె... ఆ ఆటలకీ... ఈ రాజకీయానికి సంబంధం ఏంటో?" యాద్గిరి యథాలాపంగానే అడిగాడు.

"అదే కిటుకు - పతకాలు గెలవడానికి పొరుగు రాష్ట్రాల నుండి అరువుకు ఆటగాళ్ళను పిలిపించి - వాండ్లకు భారీగా నజరానాలు ముట్టజెప్పి అపూర్వమైన ప్రతిష్టను మూట గట్టుకున్నాం - కదా! ఈ రాబోయే ఎన్నికల్లోనూ అంతే! పక్క రాష్ట్రాల నుండి దిగ్గజాల వంటి వస్తాదుల్ని పోటీలోకి దింపుతాం!"

"ఎన్నికల్లో - పక్క రాష్ట్రాల నుండి.. అభ్యర్థులు... !" జక్కులోడు రావిచెట్టు మొదలుకు ఆనుకుని మూర్ఛబోయినంత పని చేశాడు.

"అదే... పదవి కోసం పరుగుల పందెం... బడాబడా వ్యాపార వేత్తలు... డాన్‌లు... కోటీశ్వరులు... మల్టీ మిలియనీర్లు.. కంపెనీల అధినేతల్ని... అందర్నీ కూడగట్టి అసెంబ్లీకి టికట్లిచ్చి పారేస్తాం! వందో పాతిక కోట్లతో వాళ్ళు కూడా దిగబడి ఓట్లు భారీగా కొనుగోలు చేసి పారేస్తారు. అంతే... అందరూ గెలుస్తారు...!"

యాద్గిరికి ఇదంతా వింటుంటే బుర్రగిర్రున తిరిగి పోతుందేగానీ... ఈ మతలబు విండానికి మాత్రం చాలా వింతగా ఇంటరెస్టింగుగానే వుంది-

"ప్రపంచం ఒక కుగ్రామంగా మారిపోతుంది - రాష్ట్రాల ఎల్లలు చెరిపేస్తాం... అనేక దేశాల హద్దుల పనిపడతాం! నదుల సంధానం... అసెంబ్లీలో అందరికీ ప్రాతినిధ్యం... రాష్ట్రం లేదు..ఎల్లలు లేవు.. మతాలు లేవు... ఎక్కణ్నుంచి ఎవరు పోటీ చేసినా ఫర్వాలేదు... అందులోనూ మన రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి దూసుకుపోవాలంటే మనకు అన్ని రాష్ట్రాల నుండి ప్రజాప్రతినిధులు అవసరం! అపుడు వారు భారీగా తమ పెట్టుబడులను తమ తమ నియోజకవర్గాల్లోకి తరలిస్తారు - ఫ్యాక్టరీలే ఫ్యాక్టరీలు.. ఉద్యోగాలే ఉద్యోగాలు... ఉపాధే... ఉపాధి...!" బాబుగారు ఆయాసంగా ఆగారు - ఆ దెబ్బకు జక్కులోడి సంపూర్ణ మూర్ఛఘట్టం సమాప్తమయింది. యాద్గిరికిదంతా చాలా ఉద్వేగంగా... వింతగా అనిపించింది.

"మరి... మరి... ఇక్కడి పార్టీ నాయకులు.... వాళ్ళు రెచ్చిపోరా.. అధికారం వూడితే ఊరుకుంటారా?" అమాయకంగా అడిగాడు.

"బాబుగారి కిటుకంతా అక్కడే వుంది - అటుకులు... వాళ్ళంతా ఇంచార్జి యమ్మెల్లేలుగా వుండి తమ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడడానికి కంకణం కట్టుకుంటారు.... ఇంపోర్టెడ్ వాళ్ళు సమావేశాలకు అరకొరగా హాజరై తమ వ్యాపారం... పెట్టుబడులూ.. లాభాలు గట్రా చూసుకుంటారు!"

"అంటే ఒక నియోజకవర్గానికి ఇద్దరు యమ్మెల్యేలన్నమాట!" యాద్గిరి నోరు బార్లా తెరిచాడు.

"అంతేమరి! కిటుకంతా అక్కడే వుంది - అటుకులు...!" బాబుగారు బాగా హుషారై పోయారు.

"మరైతే బిల్‌గేట్సు... మర్డోక్‌గారి వంటి వారిని కూడా తెచ్చి పోటీలో దింపిపారేస్తే బాగుంటది గదా! ఎందుకంటే ఇంచార్జి మంత్రులూ.. ఇంచార్జి ముఖ్యమంత్రీ.. అటుకులు....

యాద్గిరి మాట ముగించేలోగా బాబుగారు జక్కులోడి పక్కన జాగా చూసుకుని మూర్ఛలోకి జారుకున్నాడు! ◆

ప్రపంచీకరణ విపరిణామాలకు ప్రత్యక్ష సాక్షి

గత కొద్ది సంవత్సరాలలో ప్రపంచీకరణపై చాలా పుస్తకాలు వచ్చాయి. అయితే ఈ పుస్తకానికి ఒక ప్రత్యేకత వుంది. ప్రపంచీకరణ క్రమంలో ప్రధాన పాత్ర వహించిన మేధావి దీని రచయిత కావడం అరుదైన విషయం.

జోసెఫ్ స్టిగ్లిజ్ 2001లో అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి గెలుచుకున్నారు. అమెరికా అధ్యక్షుడు క్లింటన్ ఆర్థిక సలహామండలి ఛైర్మన్‌గా ఆయన పని చేశారు. ఆ తర్వాత ప్రపంచ బ్యాంకు సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా, ప్రధాన ఆర్థికవేత్తగా పదవులు నిర్వహించారు. ఆ పదవికి రాజీనామా చేసి ప్రస్తుతం కొలంబియా యూనివర్శిటీలో ద్రవ్య, అర్థశాస్త్ర ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. క్లింటన్ సలహాదారుగా చేరడానికి ముందు స్టిగ్లిజ్ ఆక్స్‌ఫర్డ్, ప్రిన్స్‌టన్, స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీలలో ప్రొఫెసర్‌గా పని చేశారు. 1979లోనే ఆయనకు ఉత్తమ యువ ఆర్థికవేత్తగా అమెరికన్ ఎకనామిక్ అసోసియేషన్ ఇచ్చే ప్రతిష్టాత్మక పురస్కారం జాన్ బేట్స్ క్లార్క్ మెడల్ లభించింది.



శృతి తప్పిన ప్రపంచీకరణ

రచన : జోసెఫ్ స్టిగ్లిజ్,

తెలుగుసేత : గుడిపూడి విజయరావు,

వెల : రూ. 40/-;

ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

స్టిగ్లిజ్ ప్రతిభావంతుడైన ఆర్థిక శాస్త్రవేత్త మాత్రమే కాక రాజకీయ, పాలనా రంగాలలో సైతం అనుభవజ్ఞుడని పై వివరాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమాలు ఉధృతంగా సాగుతున్న ఇటీవలి కాలంలో స్టిగ్లిజ్ పేరు బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. బాగా వినిపిస్తోంది. ప్రపంచీకరణ తీరుపైన, ప్రపంచీకరణ అమలును పర్యవేక్షిస్తున్న ఐ.ఎం.ఎఫ్., ప్రపంచబ్యాంకు, డబ్ల్యు.టి.ఓ.లతోపాటు సంపన్న పెట్టుబడిదారీ దేశాల వైఖరులు, విధానాలపైన ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలే ఇందుకు కారణం. పెట్టుబడిదారీ ప్రపంచ ఆధిపత్య స్థానంలో ఉన్న అమెరికా ప్రభుత్వంలో క్యాబినెట్ హోదా కలిగిన పదవిని నిర్వహించడమే కాకుండా, ప్రపంచ బ్యాంకులో కీలక స్థానంలో కొనసాగిన వ్యక్తిగా ప్రపంచీకరణపై ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రపంచీకరణ జరుగుతున్న తీరుపట్ల ఆయన తీవ్ర అసంతృప్తిని, అసమ్మతిని వ్యక్తం చేశారు. అందువల్లనే ఆయన అభిప్రాయాలు నిరసనకారులకు విలక్షణమైన మేధోమద్దతును అందించాయి.

వర్ధమాన దేశాల అభివృద్ధికి, దారిద్ర్యనిర్మూలనకు ఎంతో దోహదపడుతుందని అంతర్జాతీయ సంస్థలు ప్రచారం చేస్తున్న 'స్వేచ్ఛా వాణిజ్యాన్ని' పందొమ్మిదవ శతాబ్దంలోని నల్లమందు యుద్ధంతో స్టిగ్లిజ్ పోల్చారంటే ఆయన విమర్శల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. వర్ధమాన దేశాలు తమ మార్కెట్లను సంపన్న దేశాల ఎగుమతులకు బార్లాతెరవాలని డబ్ల్యు.టి.ఓ. పేరుతో బలప్రయోగం చేస్తున్న సంపన్న పెట్టుబడిదారీ దేశాలు తమ మార్కెట్లలోకి మాత్రం వర్ధమాన దేశాల వ్యవసాయ ఎగుమతులను అనుమతించడం లేదు. పైపెచ్చు విపరీతమైన సబ్సిడీలను తమ దేశంలోని ఉత్పత్తిదారులకు అందిస్తున్నాయని స్టిగ్లిజ్ నిరసించారు.

ప్రైవేటీకరణపై కూడా స్టిగ్లిజ్ నిప్పులు చెరిగారు. ఇది ప్రైవేటీకరణ కాదు అవినీతీకరణ అని ఘాటుగా విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను విక్రయించే రాజ్యాధినేతలకు కమిషన్ల రూపంలో ముట్టిన సొమ్ము స్విస్ బ్యాంకు ఖాతాల్లో వారి పేరున జమవుతున్నదని ఆయన చెబుతారు. రష్యాలో ఈ ప్రైవేటీకరణ తీవ్ర దుష్ఫలితాలకు దారి తీసిందని, ఈ ప్రైవేటీకరణకు ఆధ్వర్యం వహించిన అధ్యక్షుడు ఎల్సిన్ తిరిగి ఎన్నికయ్యేందుకు ఇలాంటి నిధులు అవసరమని అమెరికా ఆర్థిక శాఖ సైతం అభిప్రాయపడిందని ఆయన వెల్లడించారు.

మార్కెటే సర్వస్వం కాదనే స్టిగ్లిజ్ మార్కెటే అంతా చూసుకుంటుందని, ప్రభుత్వ జోక్యం ఆ పనికి ఆటంకం కల్గిస్తుందనే వాదనలను త్రోసిపుచ్చుతారు. ప్రభుత్వము, మార్కెట్ పరస్పర పూరకాలుగా పని చేయాలని చెబుతారు. కొన్ని రంగాలలో ప్రభుత్వ జోక్యం తప్పనిసరి అని వివరిస్తారు. అభివృద్ధి అంటే సమాజ పరివర్తన అని చెబుతూ వర్ధమాన దేశాలలో ఇలాంటి పరివర్తనకు భూసంస్కరణల అమలు లాంటి అంశాలు అవశ్యమని ఉద్ఘాటిస్తారు.

స్టిగ్లిజ్ చెప్పిన ఈ విషయాల ప్రాధాన్యతను వేరుగా వివరించనవసరంలేదు. ఇదే సమయంలో స్టిగ్లిజ్ వ్యక్తం చేసిన అన్ని అభిప్రాయాలతోనూ ఏకీభవించనవసరం లేదు. ఉదాహరణకు తప్పుడు పద్ధతిలో జరిగిన ప్రైవేటీకరణకు ఉదాహరణగా రష్యా అనుభవాన్ని వివరించిన స్టిగ్లిజ్ ఆ దేశంలో అంతకు ముందు కొనసాగిన వ్యవస్థపై ఇచ్చిన తీర్పును సమర్థించజాలం. ప్రపంచీకరణ స్వాభావికంగా మంచిదే కాని అది అంతర్జాతీయ ఆర్థిక సంస్థల తప్పుడు విధానాలవల్లనే దారి తప్పిందనీ, దానిని ప్రస్తుత వ్యవస్థ పరిధిలోనే సరిదిద్దవచ్చునీ ఆయన అభిప్రాయం. ఇందుకోసం చేపట్టవలసిన మార్పులను ముఖ్యంగా ఐ.ఎం.ఎఫ్., ప్రపంచబ్యాంకు, డబ్ల్యు.టి.ఓ.లను ఎలా సంస్కరించవచ్చో తెలియచేస్తారు. ప్రపంచ బ్యాంకులో తన అనుభవం వీటిని బాగు చేయవచ్చన్న ఆశాభావం కల్గించిందని చెబుతారు. ప్రజలందరికీ ఉపయోగపడే ప్రపంచీకరణను ఈ సంస్కరణలు సాధిస్తాయా అన్నది ఒక ప్రశ్న అయితే, ఈ సంస్కరణల అమలు అసలు సాధ్యమేనా అన్నది మరొక ప్రశ్న.

ఏదేమయినప్పటికీ ఈ గ్రంథం ప్రపంచీకరణ దుష్ఫలితాలను ఎండగట్టడానికి దోహదపడే గ్రంథం. ప్రస్తుత వ్యవస్థ లోపలి వ్యక్తిగా ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలకుండే ప్రత్యేక విలువ ప్రపంచీకరణపై చర్చకు మరింత పదును పెడుతుంది.

'గ్లోబలైజేషన్ అంటే ఇట్స్ డిస్‌కాంటెంట్స్' అనే పేరుతో రెండు వందల ఏభై పేజీలకు పైగా ఉన్న ఆంగ్ల గ్రంథానికి ఇది సంక్షిప్తానువాదం. సంపూర్ణమైన గ్రంథానికి దాని సంక్షిప్త రూపానికి వ్యత్యాసం ఉంటుందన్న సంగతి వేరుగా చెప్పనవసరంలేదు. అయినప్పటికీ సాధ్యమైన మేరకు రచయిత వ్యక్తం చేయదలుచుకున్న మౌలికమైన కీలకమైన అభిప్రాయాలు అందించే ప్రయత్నం జరిగింది.

- విజయరావు

శిల్పకళా నిలయం డిచ్‌పల్లి రామాలయం



ఎన్.లక్ష్మణ్

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని రామాలయం శిల్పకళా నైపుణ్యాన్ని సంతరించుకుని దేశ, విదేశీ సందర్శకులను సైతం ఆకర్షిస్తూ, అంతర్జాతీయ ఖ్యాతినార్జిస్తోంది. గ్రామశివారులో సుమారు 75 అడుగుల ఎత్తులో వున్న గుట్టపై నిర్మించి ఉన్న డిచ్‌పల్లి రామాలయం విశేష చరిత్రను పరిగణలోకి తీసుకుని ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్ది అన్ని హంగులు సమకూర్చేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. తెలంగాణా ప్రాంతంలో మరెక్కడా కనిపించని విధంగా ఈ ఆలయంపైనా శిల్పాలు చెక్కబడి వున్నాయి. 13వ శతాబ్దానికి పూర్వం ఈ ఆలయాన్ని నిర్మించినట్టు చరిత్ర ద్వారా స్పష్టమవుతోంది. డిచ్‌పల్లి సమీపంలో దీక్షానగరం అనే గ్రామం ఉండేదని, అప్పట్లో అది వ్యాపార కేంద్రంగా విలసిల్లేదని, కేవలం యుద్ధాలకు సంబంధించిన వస్తువుల క్రయ విక్రయాలు మాత్రమే అక్కడ జరిగేవని పూర్వీకులు చెబుతుంటారు. ఇతర ప్రాంతాల రాజులు ఆయుధాల క్రయవిక్రయాల కోసం వచ్చినప్పుడు వారు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా సుందరమైన శిల్పకళాచాతుర్యంతో ఈ ఆలయాన్ని నిర్మించారని వాడుకలో ఉంది. వాత్సాయనుడి కామసూత్ర గ్రంథంలోని కళలకు సంబంధించిన సూత్రాలు ఈ దేవాలయంపైనా శిల్పకళా రూపంలో గోచరిస్తాయి. వాటిని స్థానిక ప్రజలు అప్పట్లో గిచ్చుబొమ్మలుగా పిలిచేవారు. గిచ్చు అంటే సంస్కృతంలో శృంగారం అని అర్థం. ఈ ప్రాంతంలో ఆలయం ఉండడం వల్ల దీనిని అప్పట్లో గిచ్చుపల్లిగా పిలిచేవారని, కాలక్రమేణా వాడుకలో అది డిచ్‌పల్లిగా మారిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఆలయ చరిత్రను పరిశీలిస్తే క్రీ.శ. 1311 ప్రాంతంలో అల్లాఉద్దీన్ ఖిల్జీ నిజామాబాద్ జిల్లాను జయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో డిచ్‌పల్లి రామాలయం నిర్మాణం జరిగి, గుడి, గోపురాలు అర్థాంతరంగా నిలిచిపోయినట్లు దీనిపై అధ్యయనం చేసిన పరిశీలకులు భావిస్తున్నారు. కేవలం ఒకరి పాలనలోనే ఈ ఆలయ నిర్మాణం పూర్తి కాలేదనడానికి అనేక దాఖలాలున్నాయని పేర్కొంటున్నారు. కాగా, ఆలయ ద్వారాలపై ఉన్న నగిషీ గోపురాలపై ద్రావిడుల సంప్రదాయ ప్రభావం కనిపిస్తోంది. ఈ గుడి విజయనగర రాజుల శిల్ప కళా చాతుర్యాన్ని చాటుతోంది. 16వ శతాబ్దపు మధ్యకాలంలో రామరాయల హయాంలో దీనిని నిర్మించి ఉంటారని పూర్వీకులు భావించారు. అయితే ఈ దేవాలయం 14వ శతాబ్దానికి చెందినదని వాడుకలో ఉంది.

కాకతీయుల కాలంలో ఆలయాన్ని చేపట్టినట్లు ప్రచారంలో ఉన్నప్పటికీ గర్భగుడి ముఖద్వారం చెక్కడాలను పరిశీలిస్తే అమ్మవారి విగ్రహాలు కనబడతాయి. రామాలయ గర్భగుడిలోని విగ్రహాల గద్దె వెనుకనుంచి సొరంగమార్గం ఉంది. ఈ సొరంగమార్గం సుమారు 25 కిలోమీటర్ల మేర ఉండేదని చెబుతుంటారు. అయితే ఈ సొరంగ మార్గాన్ని మూసివేశారు. ఆలయంలో విగ్రహాలను ప్రతిష్టించేందుకు రెండు రంధ్రాలు గల రాతి పీఠమును నిర్మించారు. విగ్రహ ప్రతిష్ఠ జరగకుండానే ఆలయ నిర్మాణం నిలిచిపోయినట్లు తెలుస్తోంది. రాజ్యమార్పిడి లేదా నిధుల కొరత కారణంగా అప్పట్లో ఆలయ నిర్మాణం నిలిచిపోయి ఉంటుందని చరిత్రకారులు భావిస్తున్నారు. అయితే 1949వ సంవత్సరంలో డిచ్‌పల్లి గ్రామానికి చెందిన గాజువాడ చిన్నయ్య అప్పట్లో రాజస్థాన్ నుంచి సీతారామ లక్ష్మణుల పాలరాతి విగ్రహాలను తెప్పించి ఈ ఆలయంలో ప్రతిష్టింప చేశారు. అప్పటి నుంచి ఈ ఆలయానికి రామాలయంగా గుర్తింపు వచ్చింది.

క్రీ.శ. 1600 సంవత్సరంలో పునఃప్రతిష్టింప చేసిన విజయనగర రాజులు ఈ ఆలయాన్ని నిర్మించి కాకతీయ రాజ్యాన్ని స్వాధీనపర్చుకోవాలన్న ఆకాంక్షను చాటుకునేందుకు చిహ్నంగా గాజుకేసరి విగ్రహాలను చెక్కించారని శిల్పకళా సంపదను బట్టి అవగతమవుతోంది.

ఈ ఆలయం ఎత్తయిన గుట్టపై ఉన్నందున పైకి చేరుకునేందుకు ఎలాంటి మెట్లో లేకపోవడంతో అప్పట్లో భక్తులు అనేక ఇబ్బందులను ఎదుర్కొనే వారు. 1952లో దేవాలయ ధర్మకర్త గాజువాడ చిన్నయ్య 125 మెట్లు నిర్మించడంతో భక్తుల రద్దీ పెరుగుతూ వచ్చింది. ప్రతి ఏడాది మాఘశుద్ధ దశమి నుంచి మాఘ బహుళ విదియ వరకు ఘనంగా నవరాత్రోత్సవాలు జరుపుతారు. కాగా, రామాలయానికి కుడివైపున 200 ఎకరాల విస్తీర్ణంలో చెరువు వుంది. ఈ చెరువును కూడా కాకతీయుల కాలంలోనే తవ్వించారని చరిత్ర చెబుతోంది. చెరువు మధ్యలో నిర్మించి వున్న కళ్యాణ మండపం చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ చెరువులో ఒకే రాతిస్తంభం ద్వారా నీరు బయటికి వెళ్ళేందుకు అప్పట్లోనే ఒక తూమును ఏర్పాటు చేశారు. కళ్యాణ మండపం సమీపంలోనే కోనేరు నిర్మించబడి వుంది. రామాలయం చుట్టూ చక్కటి రాతి స్తంభాలను సుందరంగా అమర్చారు. ఆలయ ప్రతిష్టను తెలుసుకుని దేశ విదేశాల నుంచి సందర్శకులు హాజరవుతుంటారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తులు చేస్తోంది. ◆

క్రికెట్ [illegible] తీరు మారాలి

రాంప్రసాద్

ఎంతలో ఎంత మార్పు! భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనకు బయలుదేరి వెళ్లక ముందు క్రికెట్ విశ్లేషకులు దాదాపు ఏకకంఠంతో మనదే వరల్డ్‌కప్ అని ఢంకా బజాయించి మరీ చెప్పారు. విండీస్‌పై సిరీస్ గెలుచుకోవడం, ఇంగ్లండ్‌లో జరిగిన నాట్‌వెస్ట్ సిరీస్‌ను కైవసం చేసుకోవడం, తర్వాత శ్రీలంకలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో చూపిన ప్రతిభ కొలమానంగా వారు ఈ అంచనాలకు వచ్చారు. వరుస విజయాలతో భారత జట్టు గాడిలో పడినట్టు అందరికీ అనిపించింది. అయితే న్యూజిలాండ్ పర్యటనతో అసలు విషయం బయటపడింది. భారత జట్టు మునుపటి లోపాలను అధిగమించలేదని, ఆ మాటకు వస్తే లోపాలు మరింత పెరిగాయని న్యూజిలాండ్‌లో జరిగిన పర్యటన స్పష్టం చేసింది. బౌన్సీ వికెట్లపై భారత బ్యాట్స్‌మెన్ కంగు తింటారని ప్రతి ఒక్కరికీ తెలుసును. ఈ బలహీనతనే న్యూజిలాండ్ కెప్టెన్

సొమ్ము చేసుకున్నాడు. వీలైనంత ఎక్కువ బౌన్సీ వికెట్లు తయారు చేయాలని పదేపదే సూచించసాగాడు. మొదటి టెస్టులో ఓటమి చెందడాన్ని అర్థం చేసుకోవచ్చు. తరువాత పరాజయాలు స్పష్టంగా భారత బ్యాట్స్‌మెన్ లోపమే. నాట్‌వెస్ట్, ఛాంపియన్స్ ట్రోఫీలో విజయాలు బ్యాట్స్‌మెన్ సంపాదించిపెట్టినవే. న్యూజిలాండ్‌లో ఘోర పరాజయం కూడా వారి పుణ్యమే. పరిస్థితులకు అనుగుణంగా ఆడే సత్తా భారత బ్యాట్స్‌మెన్‌కు లేకపోయింది. కెప్టెన్‌గా వరుస విజయాలు చవిచూసిన సౌరవ్ గంగూలీకి న్యూజిలాండ్ పర్యటన చేదు అనుభవాన్ని మిగిల్చింది. అజర్ రికార్డును చేరుకోవాలని ఉవ్విళ్లూరిన అతనికి విజయాలు అందని ద్రాక్ష పళ్లుగా మిగిలిపోయాయి. గెలిచిన రెండు మ్యాచ్‌లు కూడా అంత స్ఫూర్తి దాయకమైనవి కావు. రెండు మ్యాచ్‌ల్లోనూ చచ్చీ చెడి భారత్ గెలిచింది. ఐదో వన్డేలో జహీర్‌ఖాన్ ఆడకపోతే, ఆరో వన్డేలో చివర్లో శ్రీనాథ్, నెహ్రా విఫలమైతే భారత ఖాతాలో మరో పరాజయం చేరి ఉండేది. భారత్ ఓడిపోయిన మ్యాచ్‌లన్నీ ఎక్కువ తేడాతో ఓడిపోయినవే. కనీస స్థాయి పోటీ కూడా భారత జట్టు ఇవ్వలేదు. భారత జట్టు టెస్ట్ సిరీస్‌ను, వన్డే సిరీస్‌ను ఓడిపోయి ఆత్మస్థైర్యం కోల్పోయింది.

గంగూలీ చెప్పినట్లు వరల్డ్‌కప్‌పై ఆశలు పెట్టుకునే ముందు భారత్ బ్యాట్స్‌మెన్ తమ టెక్నిక్‌ను మెరుగుపరచుకోవాల్సి ఉంది. వచ్చేనెల ప్రపంచకప్ పోటీలు జరగనున్న తరుణంలో జట్టు ఇలా వరుస అపజయాలను చవిచూడటం అభిమానులను కలచివేస్తోంది. జట్టు కనీసం సూపర్ సిక్స్ దశకైనా చేరుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. భారత జట్టులో అందరూ విఫలమయ్యారనే చెప్పాలి. ఓపెనర్ వీరేంద్ర సెహవాగ్ మాత్రం సిరీస్‌లో రెండు సెంచరీలు చేసి కొంతలో కొంత మెరుగనిపించాడు. గంగూలీ, ద్రావిడ్, కైఫ్, బంగర్, దినేష్ మోంగియా ఇలా ఒకరనేమిటి దాదాపు ప్రతి బ్యాట్స్‌మెన్ ఘోరంగా ఆడారు. గంగూలీ ఒక మ్యాచ్‌లోనే 23 పరుగులు చేశాడు. మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లో అతణ్ని వైఫల్యం వెంటాడింది. నాట్‌వెస్ట్ సిరీస్ గెలుచుకోవడానికి కారకుడైన మహమ్మద్ కైఫ్ ఈ సిరీస్‌లో అత్యంత అవమానకరరీతిలో విఫలమయ్యాడు. అతని బ్యాటింగ్ సామర్థ్యాన్నే శంకించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఏ మ్యాచ్‌లోనూ అతడు కనీసం రెండంకెల స్కోరుకు చేరుకోలేదు. కొంతలో కొంత యువరాజ్ సింగ్ మెరుగనిపించాడు. అన్నిటి కంటే ఆందోళన కలిగించే అంశం ఏమంటే మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ దారుణంగా విఫలం కావడం. గాయపడి నాలుగు వన్డేలకు దూరంగా ఉన్న అతడు జట్టులో తిరిగి చేరిన తరువాత ఒరిగింది లేదు. విండీస్ ఫాస్ట్ బౌలర్లు కూడా అతన్ని పదేపదే తక్కువ స్కోరుకే అవుట్ చేశారు. అతడు వరుసగా విఫలమవుతున్నాడు. అతని బ్యాటింగ్ ఆర్డర్ మార్చడం వైఫల్యాలకు కారణం



కావచ్చని భావింపబడుతోంది. అతడు ఓపెనర్‌గా ఉండగా భారత్ భారీ స్కోర్లు చేసి ప్రత్యర్థులకు సవాళ్లు విసిరేది. లోయర్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వస్తున్న తరువాత అతడు వరుసగా విఫలమవుతున్నాడు. కనీసం వరల్డ్‌కప్‌కైనా వ్యూహనిర్ణేతలు సరైన నిర్ణయం తీసుకోవడం జట్టు ప్రయోజనాల రీత్యా అవసరం. లక్ష్మణ్ విఫలమవుతున్నాడని ఆఘమేఘాల మీద న్యూజిలాండ్ పంపిన దినేష్ మోంగియా దారుణంగా విఫలమయ్యాడు. ఇంగ్లండ్, శ్రీలంక, విండీస్‌పై భారత్‌లో జరిగిన మ్యాచ్‌ల్లో కూడా కూడా విఫలమయ్యాడు. ఏ ప్రాతిపదిక మీద అతణ్ణి ఎంపిక చేశారో సెలెక్టర్లకే తెలియాలి. భారత సెలెక్టర్ల ఆలోచనా ధోరణి మారాలి. నెహ్రా విఫలమవుతున్నా అతడు జట్టులో స్థానం పొందుతూనే ఉంటాడు. అగార్కర్‌కూడా ఇదే విధంగా జట్టులో స్థానం పొందుతూనే ఉన్నాడు. రాహుల్ ద్రావిడ్ వికెట్ కీపింగ్ కూడా న్యూజిలాండ్‌లో నిరుత్సాహం కలిగించింది. అతని చేత వికెట్ కీపింగ్ చేయించడం మంచిది కాదని కిర్మాణీ సూచించాడు. న్యూజిలాండ్ పర్యటనలో రాణించిన వారెవరైనా ఉన్నారంటే వారు సెహవాగ్, జహీర్, శ్రీనాథ్ మాత్రమే. బంగర్ ఆల్‌రౌండర్‌గా రూపుదిద్దుకుంటున్నట్టు విండీస్‌తో జరిగిన సిరీస్ ఆశలు రేకెత్తించింది. అయితే అతడు అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో విఫలమై పర్యటన మధ్యలోనే జట్టులో స్థానం కోల్పోయాడు. న్యూజిలాండ్ అనుభవంతో ఇప్పటికైనా ఫాస్ట్ పిచ్‌లను రూపొందించేందుకు యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకోవడం అవసరం. లేనిపక్షంలో న్యూజిలాండ్ అనుభవం భారత జట్టును పదేపదే వెంటాడుతూనే ఉంటుంది. ◆

మొలకలపల్లి కోటేశ్వరరావు

బుజ్జి కన్న

"ఏరోయ్ పోతురాజూ... రోజూ ఆ బర్రెపడ్డని రెండు మాట్లు కడగాల్సిందేనంట్రా? మడుసులు పోసుకోటానికే నీళ్ళు దొరక్క అల్లాడిపోతుంటే దాన్ని ఇన్ని మాట్లు ఎట్ల కడుగుతున్నావురా?"

పోతురాజు గుడిసె ముందు నడిదారిలో బకెట్‌లో నీళ్ళు పెట్టుకుని తన గేదెని కొబ్బరి పీచుతో రుద్దుతూ కడుగుతోంటే దారినపోతున్న వెంకన్న నిలబడి పలకరింపుగా అడిగాడు.

వాళ్ళు ఇద్దరూ స్నేహితులు. ఒకే ముఠాలో కలిసే పనికి పోతుంటారు.

"కడక్కపోతే ఎట్రా? మేపు అయితే కడుపునిండుగా మేపలేకపోతున్నా అనుకో! కనీసం ఒంటిమీద నాలుగు చెంబులు నీళ్ళు అయినా పోసి కడక్కపోతే ఎట్ట? అయినా ఇంకెంతకాలంలే... ఇయ్యాలా, రేపేగా!"

"అదేందిరేయ్? ఇయ్యాలా, రేపే అంటే... తరవాత కడగవెట్టా?" వెంకన్న ఆశ్చర్యపోతూ అన్నాడు.

"అమ్మేస్తన్నారా దీన్ని! దళారి అంజయ్యకి చెప్పా, బేరం తీసకరమ్మని! ఇయ్యాల మాయిటిపూట వస్తారంట బేరగాళ్ళు. ధర తక్కువో ఎక్కువో ఇంక అమ్మేయడమేరా దీన్ని! దీనికీ మాకూ వున్న రుణం ఇక తీరిపోయినట్టే!" పోతురాజు బాధగా అన్నాడు.

గొంతు జీరపోయింది.

"చూస్తాచూస్తా ఎందుకురా అమ్ముకునేది? ఇంటి బిడ్డ మాదిరిగా సాక్కున్నావు! కాలం ఎల్లకాలం ఇట్నే వుండిద్దా? వానలు పడకుండా పోతయ్యా?"

"నీకు చాలా ఆశగా వుందేందిరేయ్? కాలం తూలిపోయినాక ఇంకేం వానలు పడతయ్యిరా? అదునులోనే పడకపోతే ఇంక ఈ రోజుల్లో ఎట్ట పడతయ్యి?" నిరాశగా అన్నాడు పోతురాజు.

"ఇయ్యేడు చాలా పెద్ద కరువురా! నాకు ఇప్పుడు నలభయ్యేళ్ళు, నేను పుట్టి బుద్దెరిగినాక ఇసుంటి కరువుని ఇంత మట్టుకి చూళ్ళేదు. నేనెరగను, ఈ రోజుల్లో గడ్డి లేకపోవటం! ఎల్లోకొల్లాగా పచ్చిమేతా, పచ్చిగడ్డీ ఎక్కడపడితే అక్కడ దొరకాల్సిన రోజుల్లో చూద్దామన్నా ఎక్కడా గడ్డిపరకా, తుంగపాసా సైతం లేకపోయా!"

"వానలు పడితే కదంట్రా గడ్డి పెరిగేది! వానలే లేకపోతే ఇంకగడ్డేం పెరిగిద్దీ, గొడ్డేం మేపుతాం? వరిగడ్డి మోపు వచ్చి యాబయి, అరవై రూపాయలు చెపతాంట్రి! మోపు అని పేరే కానీ అది ఒక పనా వుండదు. సరిగా మేపితే ఒక పూటకి చాలదు!"

"మనసుంటోళ్ళం వరిగడ్డి కొని ఏం మేపుతాంరా? వాగుల్లోనో, వంకల్లోనో గడ్డి దొరికి మేపుకుంటే గిట్టుబాటు అయిద్దికానీ కొని మేపాలంటే మన వల్లేమయిద్ది?"

"అందుకే కదరా అమ్మేయాలనుకోటం! అప్పుటికే నెలరోజుల్నించీ వరిగడ్డి కొనే మేపుతున్నా! రోజులు బాగుండకపోతయ్యా, వానలు పడకుండా పోతయ్యా అని ఎదురు చూశా! ఆశ పోయింది. ఇంక మావల్ల కాదురా కొని మేపటం!"

"మాకు నాలుగ్గొడ్లు! మా ఆడదానికి గొడ్లంటే పేణంరా! రాచ్చసనుకో! దానికీ, గొడ్లుకీ అంత లంకె! నేను పనికీ పాటకీ పోయినా అది ఒక్కతే ఆ గొడ్లన్నీ సముదాయిచ్చుకునిద్ది! ఇప్పుడు మేతలేకపోయే సరికి రెండు గొడ్లు అమ్మేద్దామంటంది! చూడబోతే మేమూ రెండు గొడ్లు అమ్ముకోక తప్పేటట్టు లేదూరా!" అన్నాడు వెంకన్న.

"మేం ఒక్క గొడ్డే మేపలేకపోతంటే మీరు అన్ని ఎట్లమేపుతున్నార్రా?"

"నిరుడు ఏసుకున్న వామి వుందిలే! ఇంకా అది పదిరవై రోజులు పోయిద్ది. కాస్త భూమి వుందే! ఇప్పటికి పని జరిగిపోతంది, తరువాత ఎవారం తరవాత!"

"నువ్వు దాన్ని కడిగి కట్టేసేది వుందా, లేదా? ఊళ్ళో ఎవరో ఒక ఆసామి దగ్గరకి పోయి అడుక్కుని ఒక చిన్న పన అయినా గడ్డి తెస్తేనే దానికి సందకాటికి మేత! లేకపోతే అది పస్తువుండాల్సిందే!" గుడిసె ముందు వున్న పొయ్యి దగ్గర కూర్చుని అన్నం వండుతున్న పోతురాజు భార్య లచ్చుమ్మ భర్తని కేకేసి చెప్పింది.

"ఎవుర్ని పోయి అడిగేదే? ఎవుర్ని అడిగితే ఎవరు ఇస్తారు?" కడుగుతూనే అన్నాడు పోతురాజు.

లచ్చుమ్మ ఇంటి ముందు కట్టిన తడికలు దాటి బయటికి వచ్చింది.

"నీకు ఒక సవర బంగారం ఇయ్యమన్నా ఇస్తారు కానీ ఒక గడ్డి పాస ఇయ్యమన్నా ఇయ్యరమ్మా! ఇయ్యాల గడ్డికి డిమాండు అట్ట వుంది! బంగారం కంటే పిరింగా వుంది గడ్డి!" అన్నాడు వెంకన్న.

"అన్నా... అన్నా.. ఇయ్యాల్టికి ఒక పన నువ్వే ఇయ్యాలన్నా! దాన్ని పస్తు అయితే పడుకోబెడతాడు కానీ ఎవురోకరి వామి దగ్గరకి పోయి ఒక మోపు తెచ్చే మడిసి కాదు ఈయన! నువ్వే ఇయ్యాలనన్నా ఈ పూటకి. మాయిటి పూట బేరగాళ్ళు వస్తే అమ్ముతాం. ఇయ్యాలా రేపూ గడిస్తే చాలు! దినం గడిస్తే తనం గడిచినట్టవతందనుకో!" లచ్చుమ్మ అంది వెంకన్నతో.

"మాకే అంతంత మాత్రంగా వుంది కదమ్మాయి! ఆ కాస్తా అయిపోతే మేం కూడా అడక్క తినాల్సిందే! అడుక్కున్నా ఇచ్చేవాడు లేడుగా ముందు! సరే రారా... ఒక పన కట్టకొచ్చుకుందువు. అది చూస్తే వూరుకోను కూడా వూరుకోదు!" అని వెంకన్న కదిలాడు.

"నువ్వు పదరా వస్తన్నా!" అని పోతురాజు గేదెకి కుడితినీళ్ళు పెట్టి తీసుకుపోయి మేకుకి కట్టేశాడు.

"బుజ్జికన్న మన ఇంటికి వచ్చి నాలుగేళ్ళవతంది! అది వచ్చినాకనే ఒక అయ్యా అమ్మ దగ్గరికి పోయి కొంగుచాపి దేబిరించే పని లేకుండా పోయింది. కూటికీ కూరకీ ఇబ్బంది లేకుండా జరిగింది. అది నాలుగేళ్ళపాటు మనకి కూడు పెడితే దానికి మనం నాల్రోజుల పాటు గాసం పెట్టలేక అమ్ముకోవాల్సిన గతి పట్టే!" దిగులుగా, విచారంగా అంది లచ్చుమ్మ.

"మనం ఏం చేద్దామే? మనం కావాలని అమ్ముకుంటున్నామా? మనకి ఇంటిబిడ్డ ఎంతో అదీ అంతే! ఎంతకాలం దానికి మేత వేయకుండా మాడుద్దాం!



కాలం అట్ట వచ్చింది!" అన్నాడు పోతురాజు.

అతనికి కళ్ళముందు గతం గుర్తొచ్చింది.

నాలుగేళ్ళ క్రితం..

"ఒకరోజు పని దొరికితే నాలుగు రోజులు పని లేకుండా వుంది. ఈ టాక్టర్లూ, మరలూ వచ్చిన తరువాత కూలికీ నాలికీ పిలిచే వాడు లేకుండా పోయాడు. చేతులూ, కాళ్ళూ ముందు పెట్టుకుని ఒకరి ఎదురుగా ఒకరం కూర్చుని తినడానికి మనకి భూవులూ మ్రుట్రలూ ఏమున్నయ్యి? బతికే దారేదో చూసుకోవాలయ్యా!" అంది లచ్చుమ్మ.

"ఏం చేద్దామే?"

"ధర తక్కువలో చూసి ఒక బర్రెపడ్డని తెచ్చుకుందామయ్యా! దొరికిన రోజు ఒకరం వనికిపోయినా రెండోవాళ్ళు గొడ్డుని సముదాయిచ్చుకోవచ్చు!"

"గొడ్డుని కొనాలంటే డబ్బు కావద్దంటే?"

"కావాలి. డబ్బు లేకుండా వూరకే మన తాతాగాడు ఎవడు తోలిపెడతాడు మనకి గొడ్డుని! నా ముక్కులికీ, చెవులకీ ఉన్నయ్యి బేంకిలో పెడితే కొంత డబ్బు వచ్చింది! మిగతా డబ్బుఎవరోకరి దగ్గిర అప్పు తెచ్చుకుందాం!"

"మనకి అప్పు ఎవరు ఇస్తారే?"

"ఎవురు ఇస్తారని నన్నడిగితే ఎట్ట? ముందు పనిలోనికి దిగితే డబ్బు దొరక్కపోయిద్దా ఇంత వూరి మీద!" అంది లచ్చుమ్మ.

"కొనుక్కుందామే! మన దగ్గిర పది వందల రూపాయలు వుండయ్యి! బర్రెని కొనుక్కుని మేపుకుంటేనే ఈ కాలానికి బాగుండిద్ది! పిల్లోడు కాచుకుని వస్తాడు. వాడికి చదువు వచ్చేదీ లేదూ, బడికి పోయేదీ లేదు. చదువుకీ, పనికీ రెంటికీ కొరగాకుండా పోతాడు!" అన్నాడు పోతురాజు.

అప్పటికప్పుడే పశువుల్ని కొనిపెట్టడం, అమ్మిపెట్టడం చేసే దళారి దగ్గరికి వెళ్ళాడు. విషయం చెప్పాడు.

తక్కువ ధరలో, నాణ్యమైన బర్రె కోసం వూళ్ళోనూ, చుట్టు పక్కల గ్రామాల్లోనూ దళారిని వెంటపెట్టుకుని రెండు రోజులుతిరిగాడు.

చివరికి వూళ్ళోనే ఒక బర్రె కుదిరింది. అతను ఆరువేలా ఐదువందలు చెప్పాడు. దళారి ఆరు వేలకు బేరం చేశాడు.

తన దగ్గరే వున్న వెయ్యి రూపాయలు బయానా ఇచ్చాడు పోతురాజు.

"రెండు రోజుల్లో మిగతా డబ్బు మొత్తం కట్టి బర్రెని తోలుకుపోవాలి. రెండు రోజులు దాటితే మాత్రం బయానా వదులుకోవాల్సిందే!" అన్నాడు ఆ బర్రె ఆసామి.

"వెయ్యి రూపాయలు కట్టింది బర్రెని తోలుకొనిపోటానికా, మానుకోటానికా?" అన్నాడు పోతురాజు.

వాళ్ళ దగ్గర వున్న కొద్దిపాటి బంగారం బ్యాంకులో పెడితే మూడు వేలు వచ్చాయి. మిగతా డబ్బు కోసం వూరిమీద పడ్డాడు. చాలా మందిని అడిగాడు. ఎవర్ని అడిగినా ఉపయోగం కనపడలేదు.

"ఎట్ట చేద్దామే?"

"కటికోడి దగ్గరకి పోయి అడిగిరాయ్యా! ఎక్కువ వడ్డీ అంటే వాడే ఇస్తాడు!" అంది లచ్చుమ్మ.

కటికోడు అంటే ఆ వూళ్ళో కావాల్సిన వాళ్ళకి, వాళ్ళ అవసరాన్ని బట్టి పెద్ద వడ్డీరేటుతో అప్పు ఇచ్చేవాడు.

వాడి దగ్గరికి వెళ్ళి అడిగాడు పోతురాజు. ఆరు రూపాయల వడ్డీకి వాడు రెండు వేలు ఇచ్చాడు.

మొత్తం డబ్బు కట్టి బర్రెని ఇంటికి తోలుకొచ్చారు.

"బలే వుంది బుజ్జికన్న! బలే వుంది!" అని ఆనందంతో వాళ్ళ కొడుకు కిట్టయ్య బర్రెని చూసి ఎగిరాడు.

ఆ రోజు ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. వాళ్ళ ఆనందానికి హద్దు లేకుండా పోయింది. చాలా సంతోషంతో ఆ రోజే కాదు, కొద్ది రోజులు గడిచిపోయాయి.

ఆ బర్రె ప్రస్తావన వచ్చినప్పుడు బుజ్జికన్న అని పిలిచేవాళ్ళు. పిల్లవాడు మొదట్లో పిలిచిన పేరే దానికి ఖాయమై పోయింది.

బుజ్జికన్న ఇంటి సభ్యురాలైపోయింది.

పశువుల్ని కుటుంబ సభ్యుల్లానే భావించడం, అలా చూసుకోవడం మన వాళ్ళకి అలవాటు. అది మన భారతీయుల సంప్రదాయం, సహజ లక్షణం.

ఇంటిల్లిపాదికీ అది అంటే ఎంతో మమకారం, వాత్సల్యం, అంతులేని అనురాగం!

కిట్టయ్యకి పదేళ్ళు.

వాడు పొద్దున్నే అన్నం తిని, క్యారేజీలో అన్నం పెట్టుకుని వాగుల్లోనికీ, వంకల్లోనికీ, చేళ్ళలోనికీ దాన్ని తోలుకుపోయేవాడు.

ఎక్కడ మంచిగడ్డి వుంటే అక్కడ మేపే వాడు. బాగా పెరిగిన గడ్డి ఎంత దూరంలో వుందనుకుంటే అంతదూరం తోలుకుపోయి మేపుకు వచ్చేవాడు.

ఇతరుల గొడ్లతో పాటు మాత్రం దాన్ని కలిపేవాడు కాదు. అందరూ కలిసి, గొడ్లని కలిపి కబుర్లు చెప్పుకుంటూ మేపుకుంటుంటే వీడు వేరే. తనొక్కడే వేరుగా దాన్ని తిప్పుకుంటూ, అది కడుపునిండుగా మేసేలా చూసేవాడు.

పెళ్ళాం, తనూ ఇద్దరూ కూడా పోటీ పడి దానికి గడ్డీ, ఏ ఆసామిని అయినా అడిగి పచ్చిమేతా రోజూ తీసుకురావాల్సిందే!

రెండు నెలల్లోనే బుజ్జికన్న నునుపుగా, ఏనుగులా వచ్చేసింది.

"ఒరేయ్... మీరు ఆరువేలకి కొన్నారు. మీరు అమ్మే పనయితే మూడు వేలు లాభం ఇస్తాం. రెండు నెలల పాలు కూడా పిండుకున్నారు. చూడండి. మీకు ఎంత లాభమో!" అడిగారు బేరగాళ్ళు.

"మీరు ఆరువేలకి ఆరువేలు లాభం ఇచ్చినా మేం దీన్ని ఇచ్చేది లేదు!" అంది లచ్చుమ్మ. కిట్టయ్యకి అయితే అది ప్రాణం.

ఆ పసి వయసులోనే దానికి కుడితి పెట్టడం, మేత వేయడం, విప్పి తిప్పుకు రావడం అన్నీ పెద్ద వాళ్ళ మాదిరిగానే చేసే వాడు.

రెండు నెలలకి కటికోడి దగ్గర తెచ్చిన బాకీ తీర్చారు. మరో నెలకి బ్యాంక్‌లో బంగారం విడిపించుకున్నారు. బుజ్జికన్న కుటుంబానికి ఆధారం అయింది. దాని పాలమీదనే కుటుంబం గడిచింది. నిలదొక్కుకున్నారు. ఇంతలో ఈ ఏడాది మాయదారి కరువు దాపురించింది.

ముందు నీటి కరువు, మనుషులు తాగడానికే నీళ్ళు లేవు.

కష్టమో, నష్టమో – ఒక మైలు కాదు, రెండు మైళ్ళు వెళ్ళి నీళ్ళు తెచ్చుకోవచ్చు!

మేత!

అదే సమస్య అయింది.

ఎక్కడా పచ్చదనం లేదు. ఎక్కడా తుంగపరక సైతం లేదు.

ఏనుగులాగ వుండే బుజ్జికన్న పీనుగులాగ అయింది!

అది ఈని ఏడాది గడిచింది. ఇప్పటికీ ఒకపూట కాసిన్ని పాలు ఇస్తోంది.

అది కట్టి ఐదు నెలలు అవుతోంది. రేపు మాపట్లో ఆ కాసిని పాలు కూడా ఇవ్వడం ఆపేస్తుంది. మళ్ళీ ఈనాలంటే ఇంకా ఐదారు నెలలు వుండాలి. అప్పటి దాకా మేపాలంటే అది జరిగే పని కాదు.

ఎన్ని విధాల ప్రయత్నం చేసినా ఇక దానిని మేపటం సాధ్యం కాదు. అందుకే ఇంట్లో అందరూ



అమ్మాలని నిర్ణయించుకున్నారు.

"ఎంకన్న అన్న వామికాడికి పోయి మేత తీసకరాయ్యా! రమ్మన్నాడుగా! ఆ బాసేలి చూస్తే వూరుకోదు. ఇయ్యాల్టికి పని జరిగితే రేపుటి ఎవారం ఎట్టా చెయ్యాలో, ఏం పాడో!" అని నిట్టూర్చింది లచ్చుమ్మ.

పోతురాజు తాడు తీసుకుని మేతకి వెళ్ళాడు.

☆ ☆ ☆

"దళారి అంజయ్యకి చెప్పాను, బేరగాళ్ళని తీసుకుని వస్తానన్నాడంటివే! ఏదీరాలేదు?" రెండో రోజు సాయంత్రం భర్తని అడిగింది లచ్చుమ్మ.

"ఇందాక కనపడ్డాదే! గొడ్డు కావాలని ఎవురన్నా వస్తే నీకాడికి తీసకవచ్చే వాడ్నే కానీ, నేను ఎక్కడికి పోయి ఎవర్ని తీసుకువచ్చేదీ! ఎవురన్నా వస్తే మాత్రం నీ బర్రెని చూపెడతా అన్నాడే!"

"బాగుంది అయితే! దేశమంతా కరువు అయితే ఎవరొస్తారు కావాలని! ఎట్టా చేద్దాం మరి? అది మనకి బరువు కాదు. మేత లేకపాయె. ఎన్ని ఇక్కట్లు వచ్చినాయ్యయ్యా!"

"సరే..." అన్నాను పోతురాజు.

"ఒరేయ్.. మా గొడ్లు రెండు వట్టి పోయినయ్యిరా! అయ్యి ఎందుకు, కరువులో మేత దండగ తప్పు! మంచి జాతి గొడ్లే అయ్యి. ఆ మధ్య కట్టినయ్యి కూడా! వాటిని సంతకి తోలకపోదామనుకుంటన్నారా! శుక్కురోరం, రేపేగా సంత! ఏకువజామునే లేచి తోలకపోతన్నా. నువ్వు కూడా వస్తావేమోనని అడగడానికి వచ్చా!" అన్నాడు వెంకన్న.

"ఏమే?" భార్యని అడిగాడు పోతురాజు.

"ఊళ్ళోనే అమ్ముకుందామంటే బేరగాళ్ళు ఎవురు వస్తున్నారు? సంతకి తోలకపోయి అమ్ముకోడమే నయమేమో!" అంది లచ్చుమ్మ, సందేహంగానే.

"మనం ఇస్తాం అన్నది ఏదైనా చౌకేరా! సంతకి పోతేనీలక్కూలికి అమ్ముకుని రావాల్సిందేగా?" పోతురాజు అడిగాడు వెంకన్నని.

"మనం చెప్పిన ధరకి కొంటారా? వాళ్ళు చెప్పిన ధరకి మనం ఇస్తామా? ఏదైనా చవుకచవుకే! ఒక మాదిరి ధరన్నా రాకపోతే ఎనక్కి తోలుకొచ్చుకుందాం!"

"సరే కానీయ్ అయితే! నేనూ వస్తా ఏకువజామున బుజ్జికన్నని తోలుకుని!" అన్నాడు పోతురాజు.

"నే వస్తారా! చుక్క పొడవకముందే లేచిపోతే కానీ మనం వేళకి సంతకి చేరుకోలేం. నేవచ్చి లేవకొడతా కానీ తయారుగా వుండు!" అని వెళ్ళిపోయాడు వెంకన్న.

"వద్దు నాయనా! బుజ్జికన్నని వుంచుకుందామే!" కిట్టయ్య తండ్రిని బతిమాలుతూ అడిగాడు.

"మళ్ళీ మొదటికి వచ్చావేంరా నువ్వు! ఉంచుకుందాం, మరి దానికి గాసం?"

"ఎక్కడో చోట తంటాలు పడి తెచ్చుకుందాం నాయనా!"

"మనం తంటాలు పడ్డా అదేమైనా దొరికేదా? పైన వానలుంటే మనకి గాసం దొరికిద్దికానీ వానలే లేకపోతే ఏం దొరికిద్ది? అప్పటికే నెల రోజుల నించీ పదివందల రూపాయలకి కొని మేపితిం! ఇంక మన వల్ల కాదు నాయనా కిట్టయ్యా! మన ఇంటి మాలచ్చిమి అది! దారిలేకనే కానీ మాకు మాత్రం అమ్ముదామని బెమా? కొడుక్కి నచ్చచెపుతూ అన్నాడు పోతురాజు.

అన్నాలు తిని ముగ్గురూ పడుకున్నారు. ఎవరికీ నిద్రపట్టలేదు.

చుక్క పొడవక ముందే తన రెండు గేదెలు తోలుకుని వచ్చాడు వెంకన్న.

అతను గేదెల్ని అదిలించే శబ్దం విని కిట్టయ్య మంచం మీద లేచి కూర్చున్నాడు.

పోతురాజు కూడా లేచాడు. భుజం మీద కండువా వేసుకుని, దాని ఖర్చులకి ఇరవై రూపాయలు డబ్బు తీసుకుని గేదెని కట్టుతాడు విప్పాడు.

లచ్చుమ్మా, కిట్టయ్యా దిగులుగా దానివైపు చూస్తూ నిలబడ్డారు.

నిలబడలేక, కిట్టయ్య కొద్ది దూరం అనుసరించాడు.

"నువ్వు ఈ చీకట్లో ఎక్కడికి నాయనా? వెనక్కి తిరిగిపోయ్యా!" అన్నాడు పోతురాజు కొడుక్కి నచ్చచెప్పి వెనక్కి పంపించాడు.

ఉదయం ఎనిమిది గంటలకి వెంకన్న, పోతురాజు పశువుల సంతకి చేరుకున్నారు.

ప్రతి శుక్రవారం ఆ సంత జరుగుతుంది.

గతంలో సంతకి 40, 50 పశువులు వస్తుండేవి. ఆ రోజు 400 పశువులు, అంటే దాదాపు పది రెట్లు ఎక్కువ వచ్చాయి.

సంతలో వున్న జాగా సరిపోలేదు. రోడ్ల మీద ఇరుకిరుకుగా వాటిని కట్టేశారు.

ఎక్కడ చూసినా గొడ్లే! గుంపులు గుంపులుగా జనం!

పశువులు కొనే వాళ్ళు పదిమందికి మించి రాలేదు. నలుగురు మద్రాస్ బేరగాళ్ళు. వాళ్ళు ఇక్కడ పశువుల్ని కొని, లారీల్లో మద్రాసు 'మండి'కి తరలిస్తారు.

చూస్తూ చూస్తూ బుజ్జికన్నని కసాయి వాళ్ళకి కోతకి అమ్మడానికి పోతురాజుకి మనసు అంగీకరించడం లేదు. కానీతప్పదు.

వ్యాపారులు మరీ తక్కువ ధరకి అడుగుతున్నారు.

మేత లేదు. రైతులకి గొడ్లని అమ్ముకోక తప్పని పరిస్థితి. ఇవ్వక ఎక్కడికి పోతారు! అందుకే చాలా ధీమాతో వ్యాపారులు చాలా తక్కువకి అడుగుతున్నారు.

కసాయి వాళ్ళు కోస్తారంటే వృత్తిరీత్యా అది వాళ్ళ ధర్మం. కానీ ఈ వ్యాపారులు కసాయిల కంటే ఘోరంగా వున్నారు.

వెంకన్న తాను తోలుకొచ్చిన రెండు గేదెల్ని తెగనమ్మేశాడు.

"మరీ అంత తక్కువకి ఇవ్వకపోతే ఏం పోయిందిరా! నీకు కొద్దిగా మేత కూడా వుందిగారా!" అన్నాడు పోతురాజు

"పోనీయిరా! అక్కడ ఎంతుంది మేత? అంతగా అయితే ఒక పాడి బర్రెని కొనుక్కుంటే ఈ నష్టం పూడ్చుకోవచ్చు. వీట్ని కట్టేసి ఎక్కడ మేపుదాం?" అన్నాడు వెంకన్న.

పోతురాజు బుజ్జికన్నని రెండు వేలకి అడిగారు.

ఏం మాట్లాడలేదు పోతురాజు. ఒక్కసారి వాళ్ళవైపు చూశాడు.

వాళ్ళు ఆ రేటుకి అడిగిన తరువాత ఇంక ఒక్క క్షణం అక్కడ వుండదలుచుకోలేదు.

"నేను ఇంటికి తోలకపోతన్నారా ఎంకన్నా! నువ్వు డబ్బు తీసుకుని బస్సుకి వస్తావుగా!" అని, గేదెని తమ్మెవిప్పి అదిలించాడు.

ఇక్కడ ఇంటి దగ్గర లచ్చుమ్మా, కిట్టయ్యా చెరోమంచం మీద ముసుగు పెట్టి పడుకున్నారు.

ఇద్దరూ నిద్రలేచి వళ్ళు కూడా తోముకోలేదు. పచ్చి మంచినీళ్ళు ముట్టుకోలేదు.

ఇంట్లో మనిషిపోతే ఎంత బాధపడతారో అంత బాధపడుతున్నారు.

రోజూ కిట్టయ్య గేదెని విప్పి చౌళ్ళ వైపుతోలుకుపోయేవాడు. ఆ రోజు ఆ పనిలేకపోవడంతో ఏం చేయాలో, తరువాత రోజు నించీ తనకి ఎలా పొద్దుపోతుందో అర్థంగాక అయోమయంగా, ఆందోళనగా పడుకున్నాడు.

"లేచి బువ్వ తినయ్యా! రేత్రి కూడా సరిగా తిన్లా!" మధ్యాహ్నం సమయంలో లచ్చుమ్మ అడిగింది.

వండిన కుండ వండినట్లే వుంది. మరోసారి అడిగితే కిట్టయ్య కొట్టబోతాడని లచ్చుమ్మ మళ్ళీ అడగలేదు. చీకటి పడింది.

కిట్టయ్య గుడిసె ముందు వున్న బండమీద కూర్చున్నాడు.

పరుగుతో చెంగుచెంగున ఎగురుతూ వచ్చి బుజ్జికన్న కుడితి తొట్టిమీద పడింది.

పోతురాజు ఎక్కడో రెండు మైళ్ళ దూరంలో వున్నాడు.

"అమ్మా అమ్మా... బుజ్జికన్న వచ్చిందేయ్!" అని కిట్టయ్య పెద్దగా కేకపెట్టి, తాడు తీసుకు రావడానికి లోపలికి వెళ్ళాడు.

తల్లీ కొడుకుల ఆనందానికి అంతేలేదు. ◆

యువరాజు చదువు

పులి కళ్యాణి



అనగనగా ఒక రాజుగారికి ఒకే ఒక సంతానం! కాబట్టి రాజుగారికీ, రాణిగారికీ సదరు పుత్రడంటే అంతూ పొంతూలేని గారాబం! రాణిగారు మరీను! మొత్తం టోటల్ ఉద్ధారకుడు వాడే కాబట్టి, వాడికేమైనా జరిగితే ఆవిడగారు విలవిల్లాడిపోతుంది. విలవిల్లాడడం వరకైతే బాగానే వుండేది! ఎలాగూ రాజుగారు కాస్తో-కూస్తో ఆలోచనాపరుడూ. కాబట్టి తనకున్న వివేకంతో గంభీరంగా 'విలవిల్లాడాల్సి' వచ్చిన స్థితి గురించి 'ఆలోచిస్తే' మాత్రం రాణిగారు ససేమిరా ఊరుకునేది కాదు. ఈవిడ పోరుకూ - నసకూ తట్టుకోలేక రాజుగారు తలపట్టుకుని నిజంగానే విలవిల్లాడిపోయేవారు!

రాజుగారి కుమారుడు కుమార్‌రాజా వారికివేం పట్టవు! అన్నిటికన్నా ముఖ్యంగా ఇవేవీ తాను పట్టించుకోవాల్సినంతటి గొప్ప విషయాలుగా తోచకపోవడం.. ఇంకా రెండోదేవిటంటే రాణిగారంటూ వుండిన తర్వాత తనకు ప్రత్యేకించి ఎవరితోనూ.. ఏ విషయంలోనూ ఎలాంటి ఆలోచనా.. అవసరం లేదనిపించడం!

కుమార్ రాజా వారి అక్కడి చదువు అయిందనిపించాడు. గొప్ప చదువుల కోసం మహా పట్నానికి పోవాలన్న ఈ ఆలోచన రాణీగారు కుమార్ రాజా వారి కోసం రూపొందించిందే! అది అవసరమా? అనవసరమా? అన్న ఆలోచనకు రాజుగారు తావిచ్చే వీలూ.. అలవాటూ ఏనాడూ లేదు కాబట్టి అలవాటుగానే అంగీకారం తెలిపేశారు.

కుమార్ రాజా వారి విద్యాభ్యాసం పట్నంలో ముమ్మరంగా సాగిపోతుంది - రాణీవారు దానిపైనే తన మనసునూ.. సమయాన్ని పూర్తిగా నిమగ్నం చేసింది! కుమార్‌గారికి చక్కటి వసతి సదుపాయం ఏర్పాటయింది. పెద్ద మంచం, మంచి బెడ్డూ, పైన తిరిగే పంకా... ఒళ్ళు విరిచి చూసుకోవడానికి నిలువుటద్దం, మేడమీదనే స్నానాలగదీ... సుగంధ ద్రవ్యాల డబ్బీలు.. వగైరా వగైరా ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి.

భోజనానికి మరీ సదుపాయంగా ఆ పట్టణంలోని అత్యంత పేరు ప్రఖ్యాతులు గల 'ఏ-క్లాసు హోటల్'లో టోకు పద్ధతిన టోకెన్ లేకుండా ఏర్పాట్లు... దీనికి తగ్గట్టు బయట మిత్రబృందం కూడా ఏర్పాటు చేయబడింది. తీరికవేళల్లో కుమార్ రాజా వారికి అనునిత్యం 'అండగా' వుండడం చాలా అవసరమని రాణీగారి భావన! అందులోనూ కుమార్ రాజా వారికి విదూషకులన్నా, వందమాగధులన్నా కడు ప్రీతి-అన్న విషయం ఎరిగిందేనాయె!

కాలేజీ కడుదూరం, అనగా అరకిలోమీటరుపైనే వుండడం వల్లనైతేనేమీ.. 'సమయపాలన' వారి వంశంలో అత్యంత ప్రముఖ స్థానం వున్న చరిత్ర వల్ల నైతేనేమి కుమార్‌రాజా వారికి వారు కోరుకున్న కంపెనీ... మెచ్చిన రంగూ.. నచ్చిన మోడల్ వాహనం ఓటి అర్జంటుగా ఏర్పాట్లు జరిగిపోయినాయి-

ఇక -

కుమార్ రాజా వారి మనస్థిమితం కోసం... పురవీధుల్లో సంచరించునపుడు తన వంశ ఉదారత్వ ప్రదర్శన నిమిత్తం కూడా పెక్కు సూచనలు... ఏర్పాట్లు జరిగినాయి - వాహనం మరి ఇంధనం కోసం తరచుగా పైకం స్థానికంగా సర్దుబాట్లు చేసే ప్రయత్నం కూడా... అబ్బో... అన్నీ...!

మూడు సంవత్సరాలు మూడు క్షణాల్లా గడిచిపోయినాయి గదా! తీరా జూస్తే కుమార్‌రాజా వారు టోటల్‌గా మొత్తానికి మొత్తం అన్నిట్లోనూ అనుత్తీర్ణుడై వున్నాడు. రాజుగారు కుపితుడై చిందులు తొక్కడానికి ఏర్పాట్లు... ఎవరిమీదనైనా మండిపడి తన అక్కసును తీర్చుకునే వెసులుబాటూ చూసుకునేటంతలో రాణిగారు మాత్రం కచ్చితంగా "ఈ అపజయం వెనక పొరుగుదేశాల వారివో... పోనీ దాయాదులవో... గిట్టని ఓర్వలేని వాళ్ళకుట్ర బలంగావుందని' తన నిగూఢమైన ఆలోచన బయటపెట్టడంతో రాజుగారు నిస్సహాయంగా అప్పటిగ్గాను జుట్టు పీక్కుని తన 'తపన'ను వాయిదా వేసుకున్నాడు - రాణిగారు తన వంశ దైవాలకు వ్రతాలూ.. ఇష్టదేవతల పూజలకూ తగులుకుంది (దుష్టమాంత్రికుల, దుష్టప్రయోగ అవకాశాన్ని కొట్టిపారేయ వీలులేదు గదా)

కుమార్ రాజావారు ఓ నెల రోజులు తన అనుంగు మిత్రుల ఇళ్ళూ తోటలూ.. అవీ తిరిగీ... కళాశాలయందు తమ బంగారు జీవితం, జీవితంలోని రసాస్వాదనా.. ఆనంద అన్వేషణ చేయగల ఏకైక ఘట్టం అంతటితో ముగిసిన తీవ్ర వ్యధాపూరిత హృదయ భారాన్ని అట్లా తగ్గించుకుని, ఆ 'మధుర ఘట్టాల్నీ - తీపి అనుభవాల్నీ' నెమరు వేసుకుంటూ చక్కా ఇంటికి వచ్చి రాణి గారి ఒళ్ళో వాలాడు. రాజుగారు మాత్రం పక్క వరండాలో తోక అంటుకున్న పిల్లిలా అప్పటి వరకూ వివిధ రీతుల్లో పిచ్చపిచ్చగా అలుపు వచ్చే వరకూ జుట్టు పీక్కుంటూ గంతులు వేశాడు.

అయితే రాణిగారు మాత్రం ఇంతకాలం తన కుమార్ రాజా వారు ఆ 'మహాపట్నం'లో చక్కటి ఆరోగ్యంగా వుండగలిగినందుకూ.. ఒళ్ళు చేసినందుకూ ఆనందాశృవులు రాల్చింది.

మర్నాడు-

రాజుగారు కుమార్‌ను ఈ చదువు-పరీక్ష- రాయుట - ఉత్తీర్ణుడు కాలేకపోవుటతో, చివరగా తేలిన అంశం అసలు కొన్ని పరీక్షలే రాయకపోవుట గురించి గట్టిగా నిలవేసే సరికి కుమార్ రాజా ఒకసారి నోరు వెళ్ళబెట్టి ఆశ్చర్యాంబుదిలో విలవిల్లాడుతూ నవ్వేశాడు.

"అదేంటి నాన్నగారూ... ఈ మూడు సంవత్సరాలు అక్కడ కాలేజీలో నన్ను చేర్పించింది చదువుకొనడానికే.. అరె.. మీరు ఇన్ని రకాల... సకల ఏర్పాట్లు చేయడం చూసినాక అది నేను 'ఎంజాయ్' చేయడానికేగదా అనుకున్నాను- అయినా గొప్పగా ఎంజాయ్ చేసే అవకాశం కల్పించారు"

కడుపు మసిలిపోతుండగా వాడివేపు మిర్రిమిర్రి చూస్తూ తల పట్టుకున్నాడు అవాళే రిటైరైన టీచరు వెంకటపతి 'రాజు'గారు-

'ఎంజాయ్' అంటే ఏమిటబ్బా అని వాడితల నిమురుతూ ఆలోచనల్లో పడింది వాడి తల్లి ప్రమీలా 'రాణి'!

◆

కొండబాబు

"నేను ప్రజల అభివృద్ధి కోసమే నిరంతరం పాటుపడుతున్నానని మనవి చేసుకుంటున్నాను. మీ అందరి అభివృద్ధి కోసం, ఆడామగా తేడా లేకుండా, ధనికా, పేదా తేడా లేకుండా... అన్ని వర్గాల అభివృద్ధి కోసం పని చేస్తానని. ప్రియతమ ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన పథకాలు కూడా వర్గభేదాలు లేకుండా సమాన అవకాశాలు ఇస్తున్నాయని... మనవి చేసుకుంటున్నాను. పోటీ ఉంటేనే అభివృద్ధి... అందుకే విద్య, ఉపాధి, వైద్యం అన్ని రంగాల్లో పోటీపడి ప్రతిభ చూపిన వారికే అవకాశం..." మంత్రిగారి ప్రసంగం సాగిపోతోంది.

☆ ☆ ☆

విషయ సారాంశం రీత్యా చూసినా, ప్రసంగంలో వాడే పదాలు, పలుకుబడులరీత్యా చూసినా స్థూలంగా అధికార 'వాణి' ఇలాగే ఉంటున్నది. అచ్చుగుద్దినట్లు ఇవే పదాల వాడకం జరుగుతున్నదంటే అతిశయోక్తి కాదు.

'ఆడామగా తేడా లేకుండా... ధనికా, పేదా తేడా లేకుండా... అన్ని వర్గాల అభివృద్ధికోసం... అన్ని వర్గాలకు సమాన అవకాశాల కోసం కృషి చేయడం...' ఇందులో విషయ సారాంశం. చాలా గొప్పగా...ఉదాత్తంగా... విశాల స్పృహగా అనిపిస్తుంది ఈ వాక్యం. మొత్తంగా అలా అనిపిస్తుంది. కానీ... ఈ వాక్యంలోని పదాల విస్పష్ట అర్థాల నుంచి చూస్తే దానికి వాస్తవికత, భూమిక కనిపించవు.

ఆడామగా తేడా చూపకుండా... ఈ సమాజం ఉందా? ఆ ప్రసంగించిన పెద్ద మనిషి ఆచరణలో అలాగే వ్యవహరిస్తున్నారా? వారి ఇంట్లో పరిస్థితీ అలాగే ఉందా? ఉండదు. ఉన్నా సమాజంలో పరిస్థితే ప్రాతిపదికగానీ అక్కడక్కడా కనిపించే అరుదైన దృశ్యాలు కావు. స్త్రీ రెండో జాతి పౌరురాలిగా సాంస్కృతికంగా, విద్యాపరంగా, సాంఘికంగా వెనక్కునెట్టబడి ఉంది. అలాంటి స్థితిలో ఉన్న స్త్రీకీ, పురుషుడికీ ఒకే అవకాశాలు, కేటాయింపులు ఇస్తే వెనుకబడి వున్నవారు ముందుకెలా వస్తారు? వెనకబడి వున్న వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు, కేటాయింపులు లేకుండా చేస్తే సమానాభివృద్ధి ఎలా సాధ్యం? కాబట్టి ఉన్న తేడాను గుర్తించకుండా 'సమాన' అనే పదాన్ని తమదైన అర్థంలో అమలు చేస్తే నిజంగా సమానాభివృద్ధి సాధ్యం కాదు. కానీ.. ఏలికలు చేస్తున్నదిదే. వెనుకబడి వున్న వారిని ప్రత్యేకంగా చూడాలి.

ధనికా, పేదా తేడా లేకుండా అనే వ్యాఖ్యకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. బక్కచిక్కిన వాడికీ, బలిసిన వాడికీ ఒకే అన్నం ఇస్తే బక్కవాడికీ, బలిష్టుడికీ మధ్య తేడా అలాగే కొనసాగుతుంది. పైగా ఈ సూత్రాన్ని వదిలిపెట్టి.. బలిసిన వాడి శరీరం పెద్దది కాబట్టి వాడికి సరిపడాలంటే ఎక్కువ అన్నం పెట్టాలనే కొత్త సూత్రం ప్రకారమే అవకాశాలు, కేటాయింపుల కల్పనా జరుగుతోంది.

ఇది కూడా 'సమాన' అనే పదానికి



అర్థవిపరిణామాన్ని కల్పించి చెప్పే, ఇచ్చే 'అర్థమే'.

'అన్ని వర్గాల అభివృద్ధి కోసం..., వర్గభేదాలు లేకుండా... సమానంగా...' అనే వ్యాఖ్యనూ ఇలాగే పరిశీలించాలి.

అన్ని వర్గాలూ అంటే వేర్వేరు పార్టీల వాళ్ళని కొందరు, వేర్వేరు కులాల వారని ఇంకొందరు, వారి పార్టీలోని వేర్వేరు ముఠాల వారని మరికొందరు అనుకుంటారు. కానీ అసలు దాని అర్థం వేరు. వర్గం అనేది ఆర్థిక విభజనకు సంబంధించినది. శాస్త్రీయంగా రెండే వర్గాలుంటాయి. ధనిక వర్గం, పేదవర్గం అంతే. అన్ని వర్గాల అభివృద్ధి అంటే ఇంతక్రితం చెప్పుకున్నట్లే పేదకు, ధనికుడికి మధ్య పోటీపెట్టి... పేదవాడిని అన్యాయం చేయడమే. ఉదాహరణకు ప్రభుత్వం ఎకరాకు వెయ్యి చొప్పున కరువు నష్టపరిహారం ఇవ్వాలనుకుంటే మిగులువున్న వారినీ, ఏ పూటకాపూట తెచ్చుకునే వాడికి కూడా స్తోమత ప్రాతిపదికగానే చూస్తుంది. పరిస్థితి ప్రాతిపదిక ఉండదు. అంటే పాతిక ఎకరాలున్న భూస్వామికి పాతికవేలు, ఎకరా వున్న పేదవారికి వెయ్యి వస్తాయి. పెట్టుబడిదారులకూ ఇలాగే అత్యధికంగా అవకాశాలు, కేటాయింపులు అందుతాయి. ఇందులో ఆ పార్టీ... ఈ పార్టీ... మన కులం... తన కులం... అని తేడా ఉండదు. తన 'వర్గము' అంతే. ఒకవేళ ఆ తేడాలేమైనా స్వల్పంగా ఉన్నా, తన 'వర్గం'లోని తన కులము, పార్టీకి ప్రాధాన్యం ఉంటుంది. 'తేడాలు లేకుండా సమానంగా చూడడం' కాదు కావాల్సింది. 'అన్ని విధాలా తేడాలు లేని సమాన స్థితికి అందరూ తేబడాలి' అందుకు అవసరమైన మేర అవకాశాలు, కేటాయింపులు ఉండాలి. కానీ పాలకులు ఆ దృష్టితో చూడరు. మనలనూ చూడనీయరు. అందుకోసమే ఈ పదాడంబరం... వాగాడంబరం.

కాబట్టి 'తేడా'లు చూపనట్లు మాట్లాడే, వాడే ఈ పదాలకు వాస్తవంగా తేడాలున్నాయి. ఆచరణలోనూ ఆ 'తేడా'లు చూపబడుతున్నాయి. కానీ ఆ తేడాలను జనం గుర్తించకుండా ఉండటం కోసమే ఈ పదాడంబరం... వాగాడంబరం. వాటిని గుర్తిస్తేనే వారి మాటల వెనుక వున్న వాస్తవ ఉద్దేశాలను ప్రజలు గ్రహించగలుగుతారు. ◆

ప్రపంచ వ్యాపిత పంటల పండుగ

జనవరి 12 ఆదివారం అనుబంధంలో కవర్ స్టోరీ శీర్షికన ప్రచురించిన 'సంబరాల సంక్రాంతి' వివిధ దేశాలలో జరుపుకునే ఈ పండుగ మేళా గురించి తెలుసుకోవడం మాకెంతో ఆనందాన్ని కలిగించింది. తెలుగింటి ముంగిటిలో తీరైన రంగవల్లిలా తీర్చిదిద్దుకుంటున్న అచ్చమైన తెలుగు సంక్రాంతి సంబరాలు ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను. ముఖచిత్రం చాలా అద్భుతంగా వుంది. పుస్తక పరిచయంలో సమీక్ష చదివిన తరువాత పుస్తకం చదవాలనిపించింది.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

- సంధ్య, మచిలీపట్నం

కథ బాగుంది

జనవరి 12వ తేదీ సంచికలో ప్రచురించిన 'మైల' కథ చాలా బాగుంది. కులం కన్నా పరిశుభ్రతకే ప్రాధాన్యత ఇవ్వాలని ఈ కథలో వివరించిన తీరు బాగుంది. అదాలత్ కథలో వివరించిన కథనం చూస్తే ఇంత క్రూరంగా ప్రవర్తించే వ్యక్తులు కూడా ఉంటారా అని ఆశ్చర్యం కలిగింది. సంచిక ముఖ చిత్రం చాలా బాగుంది.

- క్రాంతి, మానుకొండవారిపాలెం, గుంటూరుజిల్లా

జన్యువుల గురించి...

జనవరి 12వ తేదీ సంచికలో గర్భధారణలో జన్యుశాస్త్రం ప్రాముఖ్యత గురించి చాలా చక్కగా వివరించారు. జన్యువులు అంటే ఏమిటి? గర్భధారణలో జన్యువుల పాత్ర, ప్రసవపూర్వ పరీక్ష అంటే ఏమిటి, ఇత్యాది విషయాలు చక్కగా వివరించారు. చిన్నారి చిత్రకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో కాలం నిర్వహించడం అభినందనీయం. ఖజురహో శిల్ప చాతుర్యాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించిన శిరీష గారికి ధన్యవాదాలు.

- పెండెం శాంతిలక్ష్మి, హైదరాబాద్